ప్రజాశక్తి
ఆదివారం 20 అక్టోబర్ 2024
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

పుండు మీద కారం జల్లే పనులు

- 'ఉక్కు'లో 3 నెలలుగా జీతాలివ్వకుండా వైద్య పరీక్షలా ?
- కాంట్రాక్టు కార్మికుల తొలగింపునకు కొత్త నాటకం
- స్టీల్‌ప్లాంట్‌లో సరికొత్త కుట్రలకు తెరలేపిన కేంద్రం
- వంతపాడుతున్న యాజమాన్యం
- తాజా పరిణామాలపై 'కూటమి' నేతల మౌనం



ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'ఇది నిజంగా వింతలో వింతే'.. గతంలో కాంట్రాక్టు కార్మికులకు వైద్య సదుపాయాలు కల్పించాలని వినతులిచ్చి పోరాడినా అమలుకు ముందుకు రాని ఉక్కు యాజమాన్యం తాజాగా మాత్రం వైద్య పరీక్షలంటూ నాటకాలు మొదలుపెట్టింది. ఈ కుట్రను గుర్తించిన స్టీల్ కార్మికులు ఐక్యంగా తిప్పికొట్టేందుకు సిద్ధమవుతున్నారు. వాస్తవానికి స్టీల్‌ప్లాంట్‌లోని సుమారు 10 వేల మంది కాంట్రాక్టు వర్కర్లకు మూడు నెలల నుంచి యాజమాన్యం జీతాలివ్వకుండా వారి కుటుంబాల కడుపులను మాడ్చుతూ వస్తోంది. తాజాగా వారికి వైద్య పరీక్షల పేరుతో సరికొత్త డ్రామాకు తెర లేపింది. తిండిలేక కడుపులు మాడుతుంటే 'పుండుమీద కారం జల్లే పనులు'కు యాజమాన్యం శ్రీకారం చుట్టిందంటూ వేల మంది కార్మికులు ప్లాంట్‌లో తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇఎస్ఐ సౌకర్యం వీరికి కల్పించాలని ఎన్ని సార్లు సిఐటియు, ఇతర కార్మిక సంఘాలు మొరలు ఎట్టుకున్నా స్టీల్ యాజ మాన్యం మొండి కేసింది. దేశంలో కాంట్రాక్టు కార్మికులకు ఎలాంటి వైద్య సౌకర్యమూ లేని 'నవరత్న' కంపెనీ ఏదైనా ఉందంటే అది స్టీల్‌ప్లాంటే కావడం విశేషం. ధర్మంగా నెల నెలా చెల్లించాల్సిన జీతాలను కాంట్రాక్టు వర్కర్లకు చెల్లించకుండా ఉక్కు యాజమాన్యం రోజుకో కుట్రకు పాల్పడుతూ వస్తోంది. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లింపులనూ నిలిపేసింది.

మొన్నటి కుట్రలను ఇంకా మరువక ముందే...

ఇటీవలే 4 వేల మందికి సంబంధించిన గేట్ పాస్‌లను రాత్రికి రాత్రే స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం తీసుకుని విధులను నిలిపేయాలని భావించిన సంగతి తెలిసిందే. ఆ చర్యలపై కార్మికులు పెద్ద సంఖ్యలో ప్లాంట్‌లో తిరగబడగా ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్న సంగతి విధితమే. ఇప్పుడు కొత్త డ్రామాను రక్తికట్టించాలని ప్లాంట్ యాజమాన్యం చూస్తోంది. 50 సంవత్సరాలు దాటిన కాంట్రాక్టు కార్మికులకు వైద్య పరీక్షలంటూ చేస్తోన్న హంగామాకు కాంట్రాక్టు వర్కర్లు బ్రేక్ వేసే దిశగా పోరాడుతున్నారు. ఈ నెల 22న ఇడి ఆఫీసు వద్ద భారీ ఎత్తున ధర్నాకు పిలుపునిచ్చామని, వైద్య పరీక్షలకు వెళ్లొద్దని కాంట్రాక్టు వర్కర్లకు చెప్పామని కాంట్రాక్టు వర్కర్ల యూనియన్ నాయకులు శ్రీనివాస్ తెలిపారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను లాభాల బాటలోకి తీసుకెళ్లే పనులకు కాకుండా 'మ్యాన్‌పవర్'ను ఎలా తగ్గించేయాలన్న తలంపుతో కేంద్రంలోని బిజెపి పావులు కదుపుతోందని స్పష్టమవుతున్నా రాష్ట్రంలోని టిడిపి, జనసేన కూటమి మౌనం దాల్చడం గమనార్హం.

అసలు వ్యూహం ఏమిటి ?

కేంద్రం వ్యూహాన్ని యాజమాన్యం పక్కాగా అమలు చేసేందుకు క్రమంగా అడుగులు వేస్తోంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో రా మెటీరియల్ ఇచ్చి, ఉత్పత్తి పెంచి, మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌లు నడిపితే ప్లాంట్‌లో ఇప్పుడున్న వర్కర్లు సైతం సరిపోరు. ముడిసరుకు, నిధులు సమకూరితే ప్లాంట్‌కు లాభాలు కూడా వస్తాయి. కాబట్టే కేంద్రం కొన్ని చర్యలకు యాజమాన్యాన్ని మిగతా 2లో..



చోడవరం మండలంలోని నర్సయ్యపేటలో నిరసన తెలుపుతున్న పాడి రైతులు

పాల సేకరణ ధర తగ్గింపుపై పాడి రైతుల భగ్గు

వార్త 5లో..

గ్రంథాలయ వ్యవస్థ బలోపేతం

రాష్ట్ర విద్య, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న పబ్లిక్ లైబ్రరీల వ్యవస్థను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర విద్య, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. శనివారం దొండపర్తి సమీపంలోని నెహ్రూ బజార్ ప్రాంతీయ గ్రంథాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం 8 గంటలకు తెరవాల్సిన లైబ్రరీని 9.45కు కూడా తెరవకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. గ్రంథాలయ సందర్శనలో భాగంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాల బలోపేతానికి పలు కీలక నిర్ణయాలు ప్రకటించారు. రాష్ట్ర వ్యాప్తంగా పబ్లిక్ లైబ్రరీల పర్యవేక్షణకు ఒక స్పెషల్ ఆఫీసర్‌ను నియమించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు, నిరుద్యోగులు కాంపిటేటివ్ పరీక్షలకు ప్రిపేర్ కావడానికి దేశంలో బెస్ట్ మోడల్‌ను మిగతా 2లో..

పర్యాటకంతో విద్యార్థులకు విజ్ఞానం, వినోదం

వార్త 2లో..

వరద బాధితులకు విరాళాల వెల్లువ

వార్త 8లో..

అభిజిత్ కార్మికుల గోడు పట్టదా ?

వార్త 8లో..

ఘనంగా ఐసిఇయు గోల్డెన్ జూబ్లీ కాన్ఫరెన్స్

- నగరంలో ర్యాలీ
- అల్లూరి విజ్ఞాన కేంద్రంలో బీమా రంగంపై చర్చ



మాట్లాడుతున్న అమానుల్లా ఖాన్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ (ఐసిఇయు) విశాఖపట్నం డివిజన్ 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా రెండు రోజులపాటు తలపెట్టిన గోల్డెన్ జూబ్లీ వార్షిక సమావేశం అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా శనివారం ఘనంగా ప్రారంభమైంది. తొలుత ఎల్ఐసి కార్యాలయం దరి అంబేద్కర్ విగ్రహం నుంచి అల్లూరి విజ్ఞాన కేంద్రం వరకూ ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకు ఉద్యమించి, ఇటీవల కన్నుమూసిన సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి ఘన నివాళ్లర్పించారు. అనంతరం ప్రారంభమైన సభలో ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఎఐఐఇఎ) ప్రధాన కార్యదర్శి శ్రీకాంత మిశ్రా, అధ్యక్షులు వి.రమేష్, మాజీ అధ్యక్షులు అమానుల్లా ఖాన్ తదితరులు మాట్లాడారు.

(ప్రధాన వార్త మెయిన్‌లో..)



ర్యాలీ నిర్వహిస్తున్న మహిళా ప్రతినిధులు

మొదటి పేజీ తరువాయి..

పుండు మీద కారం జల్లే పనులు

ఆదేశించింది. రా మెటీరియల్ ఇవ్వకుండా, ఫర్నేస్‌లు పనిచేయకుండా, ఉత్పత్తి తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇదే జరిగితే కార్మికులు ఇంత అవసరం లేదు. ఈ నేపథ్యంలో కాంట్రాక్టు కార్మికులపై వేటు వేసి ప్రైవేట్ వాళ్లకు ప్లాంట్‌ను కట్టబెట్టే కుట్ర దీంట్లో దాగి వుంది.



గ్రంథాలయాన్ని సకాలంలో తెరవకపోవడంపై అసహనం వ్యక్తం చేస్తున్న మంత్రి లోకేష్

గ్రంథాలయ వ్యవస్థ బలోపేతం

అధ్యయనం చేసి పబ్లిక్ లైబ్రరీ వ్యవస్థను బలోపేతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముందుగా నెహ్రూ బజార్ మున్సిపల్ ఎలిమెంటరీ స్కూలును మంత్రి లోకేష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ బాలల గదిని సందర్శించి కొద్దిసేపు అందులో ఉన్న పిల్లలతో సరదాగా గడిపారు. ఎబిసిడిలు, రైమ్స్ వచ్చా ? అని అడిగారు. వారు ఆడుతూ.. పాడుతూ సమాధానాలు ఇచ్చారు. గుడ్లు, పౌష్టికాహారం సరఫరాపై టీచర్లను ఆరా తీశారు. విద్యార్థులకు చాక్లెట్లు పంచి వారితో లోకేష్ ఫొటో దిగారు.

లోకేష్‌కు పలువురు వినతులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : టిడిపి విశాఖ జిల్లా కార్యాలయంలో రెండో రోజైన శనివారమూ మంత్రి నారా లోకేష్ ప్రజా దర్బార్ నిర్వహించి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు ఆయనను కలిసి వినతి పత్రాలు సమర్పించారు. 1998 డిఎస్‌సి ఎంటిఎస్ ఉపాధ్యాయులను క్రమబద్ధీకరించాలని డిఎస్‌సి 1998 టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులు లోకేష్‌కు విజ్ఞప్తి చేశారు. ఎలాంటి ఆధారమూ లేని తమకు టిడ్కో ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని విజయనగరం జిల్లా బొద్దూరుకు చెందిన వావిలపల్లి హేమలత కోరారు. ఎపి టూరిజం కార్పొరేషన్‌లో తనకు ఉద్యోగం కల్పించాలని బొద్దూరుకు చెందిన వావిలపల్లి వేణుగోపాలరావు విజ్ఞప్తి చేశారు. నాయీ బ్రాహ్మణ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ బోర్డు ఏర్పాటుచేసి నాయీ బ్రాహ్మణులను ఆదుకోవాలని విశాఖకు చెందిన దేవగుప్త రమేష్ కోరారు. మీ-సేవ సిఎస్‌సి సెంటర్ లాగిన్ ఐడిని పునరుద్ధరించాలని గొల్లలపాలెంకు చెందిన కె.రామకృష్ణ విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ భూమి విక్రయించి తమను మోసం చేసిన వారిపై చర్యలు తీసుకుని, న్యాయం చేయాలని విశాఖకు చెందిన ఆర్.లక్ష్మి కోరారు. వికలాంగురాలైన తన కుమార్తెకు గత ప్రభుత్వం పెన్షన్ నిలిపివేసిందని, తిరిగి పునరుద్ధరించాలని విశాఖకు చెందిన పుక్కళ్ల అప్పలరాజు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ గెలుపు కోసం ఎన్నో సంవత్సరాల నుండి కష్టపడుతున్న నాయకులు, కార్యకర్తలు నామినేటెడ్ పదవుల కోసం ఎదురు చూస్తున్నారని, వీలైనంత త్వరగా వారికి ఆ పదవులు ఇచ్చి గౌరవం దక్కేలా చూడాలని టిడిపి బీసీ సాధికార సమితి రాష్ట్ర గవర కన్వీనర్ మళ్ల సురేంద్ర విజ్ఞప్తి చేశారు.

చోడవరం సుగర్స్‌కు నిధులు మంజూరు చేయాలి

చోడవరం : చోడవరం చక్కెర కర్మాగారానికి నిధులు మంజూరు చేసి ఆదుకోవాలని లోకేష్‌కు జనసేన చోడవరం నియోజకవర్గ ఇంచార్జ్ పివిఎస్ఎన్.రాజు వినతిపత్రం అందించారు. రైతులకు గిట్టుబాటు ధర లేకపోవడంతో చెరుకు సాగు తగ్గడం వల్ల ఫ్యాక్టరీ క్రషింగ్ తగ్గిపోతూ వస్తోందని వివరించారు. నియోజకవర్గంలో రోడ్లు, బ్రిడ్జిలు ఏర్పాటుకు చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు పాల్గొన్నారు.

సిపి ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం కమిషనరేట్ పరిధిలో లా అండ్ ఆర్డర్ పరిరక్షణలో భాగంగా నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి శుక్రవారం రాత్రి ఈస్ట్ ఎసిపి కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. రాత్రి వేళ ఈస్ట్ సబ్ డివిజన్ సభ్యులు, అధికారులు, సిబ్బంది నిర్వహిస్తున్న విధులను సమీక్షించారు.

పర్యాటకంతో విద్యార్థులకు విజ్ఞానం, వినోదం



విద్యార్థులతో కలెక్టర్ హరేంధిర ప్రసాద్

జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పర్యాటక రంగాన్ని అన్ని వర్గాల వారికీ చేరువ చేయాలనే సంకల్పంతో.. విశిష్టతలను, విశేషాలను విద్యార్థులకు తెలియజేయాలనే ఉద్దేశంతో మూడు సెక్టార్లలో ఎడ్యుకేషనల్ టూరిజాన్ని అందుబాటులోకి తీసుకొచ్చామని, తద్వారా విద్యార్థులకు వినోదం, విజ్ఞానం లభిస్తాయని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ అన్నారు. విద్యా పర్యాటకం ద్వారా విద్యార్థులకు చారిత్రక ప్రదేశాల విశేషాలు, విశిష్టతలు తెలుస్తాయని అన్నారు. ఎడ్యుకేషనల్ టూరిజంలో భాగంగా ప్రవేశ పెట్టిన నూతన విధానానికి ఆయన శనివారం శ్రీకారం చుట్టారు. గాయత్రీ విద్యాపరిషత్, అగనంపూడి జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులతో స్థానిక కలెక్టరేట్ నుంచి బయలుదేరిన విద్యా పర్యాటక ఐటెనరరీ బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. పర్యాటక, విద్యా, ఫారెస్ట్, మత్స్యశాఖ అధికారులతో కలిసి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎడ్యుకేషనల్ టూరిజంలో భాగంగా విద్యార్థుల సౌలభ్యం నిమిత్తం జిల్లాలోని వివిధ పర్యాటక కేంద్రాలను అనుసంధానం చేశామని, వాటిల్లో ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదివే వారికి ఉచితంగా, ప్రయివేటు విద్యా సంస్థల వారికి రూ.10 కనీస రుసుంతో ప్రవేశాలు కల్పించేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. మెరైన్ మ్యూజియం ఎడ్యుకేషనల్ టూర్‌లో భాగంగా సాగరతీరంలో ఉన్న పర్యాటక ప్రాంతాలను సందర్శించవచ్చన్నారు. సీ - హారియర్ మ్యూజియం, టియు-167, ఐఎన్ఎస్ కురుసురా సబ్ మెరైన్, మారిటైమ్ మ్యూజియంలను విద్యార్థులు సందర్శించవచ్చని, గైడ్‌లు విశేషాలను తెలుపుతారని వివరించారు. టైడ్ పూలింగ్‌కు వెళ్లేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. దీని ద్వారా భూమి, జీవావరణ శాస్త్రంపై అధ్యయనం చేసేందుకు విద్యార్థులకు అవకాశం లభిస్తుందన్నారు. జీవ వైవిధ్య పర్యటనలో భాగంగా పర్యావరణంలోని జీవరాశులను అధ్యయనం చేసే అవకాశం లభిస్తుందన్నారు. ఇందిరా గాంధీ జులాజికల్ పార్క్, కావులుప్పాడ సమీపంలోని బయోడైవర్సిటీ పార్కును సందర్శించవచ్చని, కంబాలకొండ అభయారణ్యంలో కొన్ని ట్రెక్కింగ్ అనుభవాలను కూడా విద్యార్థులు సొంతం చేసుకోవచ్చని సూచించారు. తీర పర్యావరణ వ్యవస్థ యాత్రలో భాగంగా ఏయూలోని జీవశాస్త్ర ప్రయోగశాలని విద్యార్థులు సందర్శించవచ్చని, మడ అడవుల పరిశోధన కేంద్రం, ఫిషరీస్ సర్వే ఆఫ్ ఇండియా మ్యూజియంను చూసే అవకాశం కలుగుతుందని చెప్పారు. ఈ యాత్ర ద్వారా పర్యావరణ పరిక్షణకు ఆయా జీవులు ఏ విధంగా దోహదపడతాయో, ప్రకృతిని ఎలా కాపాడుకోవాలో విద్యార్థులకు సంపూర్ణ అవగాహన కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా టూరిజం అధికారిణి జ్ఞానవేణి, డిఇఒ ఎల్.చంద్రకళ, మారిటైం బోర్డు అధికారి సుబ్బిరెడ్డి, ఫారెస్ట్, మత్స్య శాఖల అధికారులు, టూరిజం కౌన్సిల్ సభ్యులు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆతిథ్య రంగానికి ప్రాధాన్యత

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రోజురోజుకూ విశాఖపట్నం మెట్రోపాలిటన్ సిటీగా ఎదుగుతున్న నేపథ్యంలో హోటల్, ఆతిథ్య రంగానికి మరింత ప్రాముఖ్యతను ఇవ్వడానికి కూటమి ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుందని విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు శ్రీభరత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హోటల్ ఇండస్ట్రీకి ఇచ్చిన హామీ మేరకు రాత్రి 12 గంటల వరకు హోటళ్లు, రెస్టారెంట్లను నడిపే అవకాశం కల్పించడం ద్వారా ఈ రంగానికి మద్దతు ఇవ్వడమే కాకుండా, గతంలో ఉన్న అనుకూల వాతావరణాన్ని పునరుద్ధరించేందుకు కృషి చేస్తున్నట్టు పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ఐటి, పర్యాటక రంగాల అభివృద్ధికి పలు చర్యలు చేపట్టనున్నామన్నారు.

లడ్డు విక్రయాలు పునఃప్రారంభం

ప్రజాశక్తి -మధురవాడ : రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం (టిటిడి)లో శనివారం శ్రీవారి లడ్డు విక్రయాలు పున్ణ ప్రారంభమయ్యాయి. ఇటీవల తిరుమలలో బ్రహ్మోత్సవాలు నేపథ్యంలో ఇక్కడ లడ్డు విక్రయాలు నిలిపివేసిన సంగతి తెలిసిందే. ఇక నుంచి మరలా ప్రతి రోజూ లడ్డు విక్రయాలు కొనసాగుతుంటాయని ఆలయ ఎఇఒ జగన్మోహనాచార్యులు తెలిపారు.

ఉచితంగా నేత్ర వైద్య పరీక్షలు

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి రెండో వార్డు సంగివలస సుఖీభవ కాలనీ ఎదురుగా ఉన్న లక్ష్మి విజయ ఆసుపత్రిలో శనివారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యాన జరిగిన ఈ వైద్య శిబిరంలో 105 మందికి నేత్ర వైద్య పరీక్షలు చేశారు. 39 మందికి శస్త్ర చికిత్స అవసరమని సంబంధిత వైద్యులు నిర్ధారించారు. వీరిని శంకర్ ఫౌండేషన్ కంటి ఆసు పత్రికి రిఫర్ చేశారు. శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి వైద్యులు శ్రీనిజ, గంగాధర్, కో-ఆర్డినేటర్ వై.రాజు, లక్ష్మి, విజయ, ఆసుపత్రి వైద్యులు డాక్టర్ డివి.రామభద్రరాజు తదితరులు సేవలందించారు. వెంపాడ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



ఆర్.తాళ్లవలసలో బోరుకు అమర్చిన క్లోరినేషన్ యూనిట్‌ను పరిశీలిస్తున్న రమేష్‌నాయుడు

రక్షిత మంచినీటి ట్యాంక్‌లకు క్లోరినేషన్ యూనిట్ల ఏర్పాటు

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలంలోని ప్రతి పంచాయతీలో ప్రభుత్వ ఆదేశాల మేరకు రక్షిత మంచినీటి టాంక్‌లకు దశల వారీగా క్లోరినేషన్ యూనిట్లు ఏర్పాటు చేయనున్నట్లు పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి విస్తరణాధికారి కనకల రమేష్‌నాయుడు తెలిపారు. భీమిలి మండలం ఆర్.తాళ్లవలస రాజవీధిలో తాగు నీరు అందించే టాంక్‌కు శనివారం ప్రయోగాత్మకంగా అధునాతన క్లోరినేషన్ యూనిట్‌ను అమర్చారు. తాగు నీరు అందించే బోరు మొదలుకొని చివర ఉన్న కుళాయి వరకు తాగు నీటి పరీక్షలు చేయగా, నీరంతా సురక్షితమని తేలిందని ఇఒపిఆర్‌డి రమేష్‌నాయుడు తెలిపారు.

యుసిడి ఎపిడిగా దొర



ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి ఒకటో జోన్ యుసిడి అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా వికె.దొర శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇతను అనకాపల్లి జోన్ నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. దాదాపు ఏడాదిగా ఇక్కడ పనిచేసిన వై.సంతోష్ కుమార్ అనకాపల్లి జోన్‌కు బదిలీ అయ్యారు.

ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు పోరాటమే శరణ్యం

యుటిఎఫ్

ప్రజాశక్తి - ఆరిలోవ : ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు పోరాటమే శరణ్యమని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టిఆర్.అంబేద్కర్ అన్నారు. ఆరిలోవ తోటగరువు ఉన్నత పాఠశాలలో చినగదిలి యుటిఎఫ్ మండల శాఖ 50వ స్వర్ణోత్సవ మహాసభ జిల్లా అధ్యక్షులు నేతల ప్రభాకర్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి టిఆర్.అంబేద్కర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 50 ఏళ్ల యుటిఎఫ్ ప్రస్థానంలో ఉపాధ్యాయ, ఉద్యోగులకు హక్కులు, రాయతీలు సాధించడంలో రాజీ లేని పోరాటాలు చేసినట్లు గుర్తుచేశారు. ఆ స్ఫూర్తితో మరో 50 ఏళ్ల పాటు ఉపాధ్యాయ, విద్యారంగాన్ని కాపాడు కోవటానికి రాజీలేని పోరాటానికి సన్నద్ధులు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా ఎన్.ప్రసాద్, అధ్యక్షులుగా మురళి, ప్రధాన కార్యదర్శిగా పద్మావతి, కోశాధికారిగా కుమారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో పీతల సురేష్, జి.ఉషారాణి, రాజేశ్వరి, జగన్, నీలాద్రి తదితరులు పాల్గొన్నారు.



మహా సభలో తీర్మానం చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

జివిఎంసి కమిషనర్ విస్తృత పర్యటన

ప్రజాశక్తి -యంత్రాంగం

భీమునిపట్నం : జివిఎంసి ఒకటో జోన్ 2, 3 వార్డుల పరిధిలోని పలు ప్రాంతాల్లో కమిషనర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ శనివారం విస్తృతంగా పర్యటించారు. సముద్రంలో ఆటుపోట్లు వచ్చే సమయంలో స్థానిక బోయివీధి నోవోటల్ ఎదురుగా రోడ్డుపైకి సముద్రపు నీరు చేరడంతో పక్కనే నివాసముంటున్న మత్స్యకార కుటుంబాలు ఆందోళనకు గురవుతున్నాయని, ప్రజల రాకపోకలకు ఆటంకం కలువుతున్నందున రక్షణ గోడ నిర్మించాలని జివిఎంసి కమిషనర్‌ను మత్స్యకార నాయకులు గంటా నూకరాజు, రెండో వార్డు కార్పొరేటర్ గాడు చిన్నికుమారిలక్ష్మి కోరారు. కమిషనర్ స్పందిస్తూ రక్షణ గోడ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ప్రధాన ఇంజినీర్‌ను ఆదేశించారు. మెయిన్ రోడ్డు పక్కన జివిఎంసి ఆధ్వర్యాన నిర్మిస్తున్న వాణిజ్య సముదాయాన్ని, చేపల మార్కెట్‌ను ఆయన పరిశీలించారు. వాణిజ్య సముదాయం భవనంపై కల్యాణ మండపం నిర్మిస్తే ఉపయోగంగా ఉంటుందని రెండో వార్డు కార్పొరేటర్ గాడు చిన్ని కుమారి లక్ష్మి, మాజీ కౌన్సిలర్ గంటా నూకరాజు కోరిన మీదట, కమిషనర్ స్పందిస్తూ అంచనాలు తయారుచేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. గంట స్తంభం ప్రాంగణాన్ని ఆధునీకరించాలని అధికారులను ఆదేశించారు. ఫుట్‌బాల్ గ్రౌండ్‌ను, ఇండోర్ స్టేడియాన్ని పరిశీలించారు. ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో వర్షపు నీరు బయటకు వెళ్లేందుకు వీలుగా కాల్వల నిర్మాణానికి స్థల పరిశీలన చేయాలని పర్యవేక్షక ఇంజినీర్ శాంసన్‌రాజు ను ఆదేశించారు. ఇండోర్ స్టేడియాన్ని పిపిపి పద్ధతిలో స్పోర్ట్స్ కాంప్లెక్స్‌గా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఒకటో జోన్ కమిషనర్ పిల్లి ప్రేమ ప్రసన్నవాణి, కార్య నిర్వాహక ఇంజినీర్లు ఏడుకొండలు, శ్రీనివాసప్రసాద్, విజయదుర్గ, ఎసిపి తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.



ముడసర్లోవలో భవనాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ సంపత్‌కుమార్

పాత స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ పరిశీలన

ఆరిలోవ : ముడసర్లోవ రహదారి సమీపంలోని పాత స్కిల్ డెవలెప్‌మెంట్ కేంద్రాన్ని జివిఎంసి కమిషనర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ పరిశీలించారు. భవనంలోని అన్ని విభాగాల్లో వ్యర్థాలతో నిండి ఉండడం గమనించారు. భవనం విస్తీర్ణం, ఖాళీ స్థలం విస్తీర్ణం వివరాలతో కూడిన నివేదికను సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఖాళీగా ఉన్న ఈ భవనంలో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా రాత్రి పూట సెక్యూరిటీని నియమించాలని జోనల్ కమిషనర్ సింహాచలాన్ని ఆదేశించారు. హెచ్‌పిసిఎల్ యాజమాన్యం ఖాళీ చేసిన స్కిల్ సెంటర్‌ను పూర్తిగా మరమ్మత్తులు చేపట్టి జివిఎంసికి అందించనందున వివరణ కోరుతూ హెచ్‌పిసిఎల్ యాజమాన్యానికి లేఖను పంపాలని జోనల్ కమిషనర్‌ను అదేశించారు. భవనాన్ని వినియోగానికి అనుకూలంగా, తీర్చిదిద్దేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పర్యవేక్షక ఇంజినీరు శాంసన్ రానును ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి ప్రధాన ఇంజినీరు శివప్రసాదరాజు, డిహెచ్ దామోదరరావు, ఎఇ వెంకటరావు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన డిఎం అండ్ హెచ్ఒ

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి 6వ వార్డు పరిధి పిఎం.పాలెంలో ఉన్న పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని డిఎం అండ్ హెచ్ఒ పి.జగదీశ్వరరావు శనివారం సందర్శించారు. అక్కడ జరుగుతున్న జాతీయ ఆరోగ్య కార్యక్రమాల గురించి సమీక్షించారు. వ్యాధి నిరోధక టీకాలు జరిగే ప్రాంతం రామాలయం ఏరియా అవుట్ రీచ్ సెషన్‌ను సందర్శించారు. అక్కడ ప్రజలతో మాట్లాడి వాక్సినేషన్ గురించి తెలుసుకున్నారు. తదుపరి పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి సిబ్బంది హాజరు, ఇహెచ్ఆర్, ఒపి సేవలు, ల్యాబ్ టెస్టు, మాతా శిశుఆరోగ్య సేవలు గురించి ఆరా తీశారు. అడల్ట్ బిసిజి వాక్సినేషన్‌పై సూచనలు చేశారు. సిబ్బంది సమయపాలన పాటించాలని, ఎఫ్ఆర్ఎస్ హాజరు విధిగా వేయాలని ఆదేశించారు. ఈ సందర్శనలో డాక్టర్ బి.ఉమావతి, డిపిఎంఒ బి.నాగేశ్వరరావు, పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యులు, ఆరోగ్య సిబ్బంది నాగభూషణం పాల్గొన్నారు.



ఆరోగ్య కేంద్రం సేవలపై వివరాలు సేకరిస్తున్న డిఎం అండ్ హెచ్ఒ

యాత కులానికి బిసి అట్రాసిటీ యాక్ట్ అమలుచేయాలి

ప్రజాశక్తి -ఆనందపురం : బిసి అట్రాసిటీ యాక్ట్‌ను యాత కులానికి అమలు చేయాలని రాష్ట్ర యాత కమ్యూనిటీ ప్రెసిడెంట్ అంగటి రాము కోరారు. రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌ను పార్టీ ఆఫీసులో కలిసి పలు సమస్యలపై వినతి పత్రాన్ని అందజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉత్తరాంధ్రలో బీసీ కులాల్లో అత్యంత వెనుకబడి ఉన్న యాతకులాన్ని అభివృద్ధి చేయాలని కోరారు.

నేరాలు ఘోరాలు

146 కిలోల గంజాయి స్వాధీనం

ఇరువురు అరెస్ట్ : మరో ఇద్దరి కోసం గాలింపు

ప్రజాశక్తి- నక్కపల్లి : ఉమ్మడి విశాఖ జిల్లా ఏజెన్సీ ప్రాంతం నుంచి ఒక కారులో 146 కేజీల గంజాయిని అక్రమంగా తరలిస్తుండగా శనివారం ఉదయం వేంపాడు టోల్ ప్లాజా వద్ద సీఐ కుమారస్వామి సిబ్బందితో తనిఖీలు చేపట్టి పట్టుకున్నారు. ఈ సందర్భంగా సిఐ కుమారస్వామి విలేకరులతో మాట్లాడుతూ మహారాష్ట్రకు చెందిన రామేశ్వర్ చౌహాన్, రాబిన్ అనే వ్యక్తులు ఏజెన్సీ ప్రాంతం నుంచి గంజాయి తీసుకురావాలని మోమిన్ రీస్‌జులా, ప్రకాశ్ మంగీలాల్ జయదేవన్‌లను పురమాయించడంతో వారు కారులో ఈ నెల11న విశాఖ చేరుకున్నారని, 15న రామేశ్వర్ చౌహాన్, రాబిన్ కూడా విశాఖ చేరుకున్నారన్నారు. శనివారం ఉదయం మోమిన్ రీస్ జులా, ప్రకాశ్ మంగీలాల్ జయదేవ్ కారులో 146 కేజీల గంజాయిని ముంచింగిపుట్ సమీపాన కొనుగోలు చేసి కారులో మహారాష్ట్రలోని బీడ్ జిల్లాకు తీసుకెళ్తుండగా, వేంపాడు హైవే టోల్ ప్లాజా వద్ద తనిఖీలు నిర్వహించి పట్టుకున్నట్లు సిఐ వెల్లడించారు. రెండేసి కేజీల చొప్పున గంజాయి ప్యాకెట్లు 73 వున్నాయని, సుమారు రూ.4.38 లక్షలు విలువైన 146 కేజీల గంజాయి స్వాధీనపర్చుకుని, ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశామన్నారు. ఇదే కేసులో మధ్యవర్తులుగా వున్న రామేశ్వర్‌చౌహాన్, రాబిన్ కోసం గాలిస్తున్నామన్నారు.

నేటి నుంచి ఉపకార్ క్రికెట్ టోర్నీ

ప్రజాశక్తి - ఆరిలోవ : ఉపకార్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన ఉపకార్ కప్-2024 సీజన్ 2 మెగా క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ప్రారంభమవుతుందని ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ కంచర్ల అచ్యుతరావు తెలిపారు. క్రీడాకారులకు అందజేసే టీ షర్ట్‌లను కంచర్ల అచ్యుతరావు విడుదల చేశారు ఆరిలోవలోని ఉపకార్ ఛారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో అచ్యుతరావు మాట్లాడుతూ, ఈ టోర్నమెంట్‌లో 24 ఫ్రాంచైజీలు నుంచి 450మంది ఆటగాళ్లు పాల్గొంటున్నారని తెలిపారు. పినాకిల్ మైదానంలో మ్యాచ్‌లు జరుగుతాయని, ప్రతి మ్యాచ్‌కు లైవ్ ఉంటుందని చెప్పారు. సినీ నటులు ఉపేంద్ర బాబు పుట్టినరోజు సందర్భంగా ఈ నెల 29న విజేత జట్టుకు రూ.లక్షా 20వేలు, రన్నర్ జట్టుకు రూ.60వేలు, తృతీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.30వేలు ప్రైజ్ మనీ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. యువత చెడుమార్గం పట్టకుండా క్రీడలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. నవంబర్‌లో రాష్ట్ర స్థాయి వాలీబాలీ పోటీలు నిర్వహిస్తున్నట్టు ప్రకటించారు. డాక్టర్లు, జర్నలిస్టులు, అధికారులు తదితర ఆరు జట్లుతో ఫ్రెండ్లీ మ్యాచ్ కూడా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. పినాకిల్ మైదానాన్ని క్రికెట్ స్టేడియంగా తీర్చిదిద్ది యువతకు ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మేనేజర్ సుధీర్, 24 ఫ్రాంచైజీల నుంచి క్రీడాకారులు, టోర్నమెంట్ ఆర్గనైజర్స్ సుదీర్, రెహ్మాన్, నాగు, నవీన్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పకుండా పాటించాలని ద్వారకా క్రైమ్ ఎస్ఐ ఎస్.రాజు అన్నారు. శనివారం ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ, వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా వాడాలని, మద్యం తాగి వాహనాలు నడపకూడదని చెప్పారు. అనంతరం అభయ్ హోటల్‌లో తనిఖీలు నిర్వహించారు.

జనసేనలో పలువురు చేరిక

ప్రజాశక్తి-సీతమ్మధార : సీతంపేటలోని గల జనసేన పార్టీ నగర కార్యాలయంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ సమక్షంలో ఉమెన్స్ కాలేజీ ఎదురుగా ఉన్న నైట్ ఫుడ్ కోర్టు ప్రెసిడెంట్ పోలవరపు నరసింగ్ ఆధ్వర్యాన 150 మంది సభ్యులు జనసేన పార్టీలో చేరారు. ఫుడ్‌కోర్టు సభ్యులు కె.సాయికుమార్, అరసాడ లక్ష్మి, ఎ.భారతి, చిన్న, వంశీ, రమేష్, రమణమ్మ, సత్యవతి, భవాని, చిన్నమ్మలు, నాయుడు, మురళి, సురేష్ తదితర 150 మందికి కండువా వేసి వంశీకృష్ణ శ్రీనివాస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ, పార్టీ మీద నమ్మకంతో చేరిన ఫుడ్‌కోర్టు సభ్యులకు సముచిత స్థానం కల్పిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో శివ ప్రసాద్‌రెడ్డి, సురేషబాబు, నారా నాగేశ్వరావు, శ్రీనివాస్, మర్రి వేముల శ్రీనివాస్, భయన సునీల్, తేజ, అశోక్, శివ, తదితరులు పాల్గొన్నారు,

నిత్యావసరాల ధరలను తగ్గించాలి : సిపిఐ

ప్రజాశక్తి - యంత్రాంగం

ఆరిలోవ : భారీగా పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని సిపిఐ ఆధ్వర్యాన ఆరిలోవ కాలనీలో శనివారం ధర్నా నిర్వహించారు. ఆరిలోవ కాలనీ, దుర్గాబజార్, పాండురంగాపురం ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. పెరిగిన ధరలకు హద్దే లేదా ఏలేవాడికి బుద్దే లేదా అంటూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఎస్‌కె రెహ్మాన్, ఎ.దేవుడమ్మ, ఎ.రవి, సిహెచ్.కాసుబాబు తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి : నిత్యవసర వస్తువుల ధరలను అదుపు చేయాలని కోరుతూ సిపిఐ ఆధ్వర్యాన వేపగుంట జంక్షన్‌లో కరపత్రాలను పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఆర్.శ్రీను, రమణ, అనురాధ, రామలక్ష్మి పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : సిపిఐ ఆధ్వర్యాన పూర్ణామార్కెట్ దుర్గాలమ్మ గుడి దరి అల్లూరి విగ్రహం వద్ద ఆందోళన చేపట్టారు. నాయకులు ఎం.మన్మధరావు, జిఎస్‌జె.అచ్యుతరావు పాల్గొన్నారు.

విద్యుత్ భారాల నుంచి విముక్తి కల్పించండి : సిపిఐ

ప్రజాశక్తి -మధురవాడ : విద్యుత్ చార్జీలు పెంచి, ట్రూఅప్ చార్జీల భారం మోపి, స్మార్ట్ మీటర్లు ఏర్పాటుచేసి ప్రజలపై భారాలు మోపవద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని సిపిఐ డిమాండ్ చేసింది. ఈ మేరకు పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు శనివారం ఒక ప్రకటన విడుదలచేశారు. గత వైసిపి ప్రభుత్వం 8 సార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై రూ.50 వేల కోట్లు భారాలు మోపిందని, కూటమి ప్రభుత్వం కూడా కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకు తలొగ్గి స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చెయ్యడం ద్వారా రూ.17 వేల కోట్లు అదనంగా భారం వెయ్యడానికి సిద్ధపడిందని ఆరోపించారు. ఇదికాకుండా ట్రూఅప్ చార్జీలు, ఇందన చార్జీలు పెంచితే ప్రజలు ఇబ్బందులు పడతారని, వీటిని తక్షణమే రద్దు చెయ్యాలని, స్మార్ట్ మీటర్లు ఏర్పాటును ఉపసంహరించుకోవాలని కోరారు. అలాకాని పక్షంలో మరో విద్యుత్ ఉద్యమం తప్పదని హెచ్చరించారు.

డైట్‌లో జిల్లా స్థాయి పోటీలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ డైట్‌లో సమగ్ర శిక్ష ఆధ్వర్యాన పలు అంశాలపై విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. డైట్ ప్రిన్సిపల్ ఎం.జ్యోతికుమారి పోటీలను ప్రారంభించారు. పిఎం శ్రీ పథకంలో భాగంగా జిల్లాలో ఎంపికైన 5 పాఠశాలల విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. వక్తృత్వ పోటీల్లో విన్నర్స్‌గా పెందుర్తి ప్రభుత్వ హైస్కూల్, రన్నర్స్‌గా ఆనందపురం జెడ్పీ హైస్కూల్, క్విజ్ పోటీల్లో విన్నర్స్‌గా ఆనందపురం జెడ్పీ హైస్కూల్, రన్నర్స్‌గా చిట్టివలస జెడ్పీ హైస్కూల్, డిస్కవర్, లెర్న్ లోకల్ సైట్స్ పోటీల్లో విన్నర్స్‌గా చిట్టివలస జెడ్పీ హైస్కూల్, రన్నర్స్‌గా పెందుర్తి హైస్కూల్ నిలిచినట్లు నిర్వాహకులు తెలిపారు. జిల్లా స్థాయి పోటీల విజేతలు విజయవాడలో ఈ నెల 21 నుంచి జరుగు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని సమగ్ర శిక్ష పథకం అకడమిక్ మానిటరింగ్ కమిటీ అధికారి జి.లక్ష్మి తెలిపారు

27, 28 తేదీల్లో స్థానిక జాతుల పరిరక్షణపై వర్క్‌షాపు

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్ర విశ్వవిద్యాలయం వృక్ష శాస్త్ర విభాగ ఆధ్వర్యాన తూర్పు కనుమలలో స్థానిక జాతుల పరిరక్షణపై ఈ నెల 27, 28 తేదీల్లో జాతీయ వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు ఉపకులపతి ఆచార్య జి.శశిభూషణరావు తెలిపారు. ఈ మేరకు సదస్సు పోస్టర్‌ను శశిభూషణరావు తన కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు.

పోర్టు హాస్పిటల్ ప్రయివేటీకరణను ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : పోర్టు హాస్పిటల్ ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని యునైటెడ్ పోర్టు అండ్ డాక్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ డిమాండ్‌చేశారు. పోర్టు హాస్పిటల్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ఆసుపత్రి వద్ద చేపట్టిన రిలే నిరాహారదీక్షలు శనివారం నాటికి 19వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా కె.సత్యనారాయణ మాట్లాడుతూ, ప్రభుత్వ నిర్ణయం ఉద్యోగుల హక్కులను, వారి కుటుంబాల ఆరోగ్య భద్రతను క్షీణింపజేసే దిశగా ఉందన్నారు. విశాఖపట్నం రూ.386 కోట్ల లాభాలను సొంతం చేసుకున్నా ఆసుపత్రిని ప్రయివేటుకు అప్పగించడం సిగ్గుచేటన్నారు. కేవలం లాభాల కోసం ప్రయివేటుకు ఇచ్చేయడం కార్మికుల హక్కులను హరించడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికుల సంక్షేమం, ఆరోగ్యాన్ని హరించడమే కాకుండా, ప్రజలకు మెరుగైన సేవలను అందించాల్సిన బాధ్యతను ప్రభుత్వం విస్మరించి, ప్రయివేటు సంస్థల ప్రయోజనాలను కాపాడేందుకు మాత్రమే ఆసక్తి చూపుతుందని విమర్శించారు. ప్రయివేటీకరణ వల్ల కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటారని తెలిపారు. ఈ నిరాహార దీక్షలో సిఐటియు నాయకులు శంకరరావు, రాఘవులు, నాయుడు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

శిశువు మృతిపై ఆందోళన

ప్రజాశక్తి-ఉక్కునగరం : అగనంపూడి ఏరియా ఆసుపత్రి వద్ద శుక్రవారం అర్ధరాత్రి పుట్టిన మగ శిశువు మృతికి ఆసుపత్రి సిబ్బంది, వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బంధువులు ఆందోళన చేపట్టారు. ఈ మేరకు వైద్యులు, నర్సులపై దువ్వాడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. డాక్టర్ విధులకు హాజరు కాకపోవడం వల్లనే నర్సులు తెలిసీతెలియక చేసిన వైద్యం వల్ల బిడ్డ మృతి చెందినట్లు బంధువులు ఆరోపిస్తున్నారు. బాధితుల కథనం ప్రకారం... అగనంపూడి పరిధి కొత్తూరుకు చెందిన నాగులపల్లి సుచిత్ర అగనంపూడి ఏరియా ఆసుపత్రిలోనే క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకుంది. ప్రసవం సమయం కావడంతో డెలివరీ కోసం అగనంపూడి ఆసుపత్రిలో చేరింది. శుక్రవారం రాత్రి అయినప్పటికీ పురిటి నొప్పులు రాకపోవడంతో సిబ్బంది వెళ్లిపోయారు. డ్యూటీలో నర్సులు మాత్రమే అందుబాటులో ఉన్నారు. అర్ధరాత్రి సమయంలో నొప్పులు పెరిగాయి. దీంతో వైద్యుడికి సమాచారం అందించినప్పటికీ వైద్యుడు స్పందించలేదు. అప్పటికే బిడ్డ తల బయటికి వచ్చింది. నర్సులు ప్రసవం చేశారు. తలభాగాన్ని పట్టుకొని లాగటంతో తలపై వేళ్లతో ఘాట్లు పడ్డాయి. బిడ్డ ప్రసవించిన తర్వాత ఏడవకపోవడంతో ఆందోళనకు గురై డాక్టర్‌కు ఫోన్ చేశారు. డాక్టర్ ఉమ్మినీరు తాగటం వల్ల బిడ్డ పరిస్థితి ప్రమాదకరంగా ఉందని చెప్పి అంబులెన్స్ ఏర్పాటు చేసుకొని కెజిహెచ్‌కు తరలించాలని సూచించారు. అంబులెన్స్ ఏర్పాటు చేసుకునే లోగానే తల్లి వద్ద నుంచి రిజిస్టర్‌లో సంతకాలు తీసుకొని తర్వాత బిడ్డ చనిపోయిందని చెప్పారు. దీంతో బంధువులంతా శనివారం ఉదయం ఆసుపత్రికి చేరుకొని ఆందోళన చేశారు. ఆసుపత్రిలో ప్రధాన వైద్యులు భారతీదేవికి ఫిర్యాదు చేశారు. అనంతరం దువ్వాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అగనంపూడి ఏరియా ఆసుపత్రిలో గడిచిన ఆరు నెలల కాలంలో ముగ్గురు శిశువులు మరణించినట్లు బంధువులు ఆరోపిస్తున్నారు.

పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు మాక్ డ్రిల్



ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న మునిరత్నంనాయుడు

ప్రజాశక్తి -ఉక్కునగరం : పరిశ్రమలలో అనుకోకుండా అగ్ని, రసాయనాల ప్రమాదాలు, విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించినప్పుడు ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా తీసుకునే జాగ్రత్తలు గురించి దువ్వాడ విసెజ్‌లోని సినర్జీస్ కంపెనీలో మాక్ డ్రిల్ నిర్వహించారు. స్టీల్‌ప్లాంట్ అగ్నిమాపక రిటైర్డ్ ఇన్‌స్పెక్టర్ మునిరత్నం నాయుడు ముఖ్యఅతిథిగా హాజరై పరిశ్రమలలో ప్రమాదాలు జరిగిన సమయంలో తీసుకోవాల్సిన నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. ప్రమాదాలు సంభవించినప్పుడు అన్ని శాఖల సమన్వయంతో వాటిని అరికట్టవచ్చని తెలిపారు. ప్రతి పరిశ్రమా ఇటువంటి మాక్‌డ్రిల్‌ను ప్రతి నెలా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమములో ఫౌండ్రీ సీనియర్ మేనేజర్ రమణమూర్తి, కంపెనీ భద్రతా అధికారి నీలకంఠరావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

టౌన్ ప్లానింగ్ ఎసిపిగా తిరుపతిరావు

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి ఒకటో జోన్ పట్టణ ప్రణాళిక విభాగం అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా ఎం.తిరుపతిరావు శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇతను ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ కొంత కాలంగా పనిచేసిన డి.శ్రీనివాసరావు ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్‌కు బదిలీపై వెళ్లారు.



మొక్కను నాటుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మొక్కల నాటివేత

ప్రజాశక్తి-సీతమ్మధార : యూనియన్ బ్యాంకు ఎల్‌బి కాలేజీ శాఖ అందించిన 50 మొక్కలను ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల ప్రాంగణంలో నాటారు. ప్రాంతీయ నేత్ర వైద్యశాలను సందర్శించిన విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్ ముందుగా ఒక మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు, ప్రాంతీయ నేత్ర వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వి.మీనాక్షి, ఆర్ఎంఒ డాక్టర్ నవీన్‌కుమార్, ఇతర వైద్యులు ఎస్.వెంకటరావు, సిబ్బంది, యూనియన్ బ్యాంకు ప్రతినిధులు ఎస్.సంతోష్‌కుమార్, డి.అనిల్‌కుమార్, జి.కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.

సిసి రోడ్లకు శంకుస్థాపన

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని రేవిడి వెంకటాపురం, కోరాడ, బిఆర్.తాళ్లవలస, అయినాడ గ్రామాల్లో ఎంజిఎన్ఆర్ఇజిఎస్ నిధులతో ఒక్కొక్క గ్రామానికి రూ.15 లక్షలు చొప్పున ఇంటర్నల్ సిసి రోడ్లకు శనివారం భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి మాజీ సభ్యులు కె.దామోదర, టిడిపి మండల అధ్యక్షులు కె.రమణ, ఎంపిడిఒ ఎం.విజయ్‌కుమార్, తహశీల్దార్ కె.ఆనంద్‌కుమార్, వెలుగు ఎపిఒ సాయిరమేష్, ఉపాధి హామీ పథకం ఎపిఎం వరలక్ష్మి, స్థానిక నాయకులు గంగరాజు, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో 'పల్లె పండగ'

ప్రజాశక్తి-యంత్రాంగం

పరవాడ : పల్లె పండగ - పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని ముత్యాలమ్మపాలెం పంచాయతీలో ఉపాధి హామీ నిధులతో పలు అభివృద్ధి పనులకు శనివారం స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సిసి రోడ్లు, వాటర్ ట్యాంకులు, డ్రైనేజీల నిర్మాణం చేయనున్నట్లు చెప్పారు. ముత్యాలమ్మపాలెం సర్పంచ్ చింతకాయల సూజాత ముత్యాలు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటిసి పైలా జగన్నాథరావు, మాజీ ఎంపిపీలు మాదంశెటి నీలబాబు, మానవరపు అప్పలనాయుడు, తిక్కవానిపాలెం సర్పంచ్ చేపల మసేను, ఎంపిటీసి అర్జిల్లి దేవిరవి, బంగారు రాజు మాజీ ఎంపిటీసి చింతకాయల అమ్మోరు, మండల కోఆప్షన్ సభ్యులు మైలపల్లి అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని అచ్చర్ల, మోసయ్యపేట, జి.సింగవరం గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమం శనివారం జరిగింది. స్థానిక శాసన సభ్యులు కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ సింగవరం పాఠశాలలో సమస్యల పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో కూటమి నాయకులు గొంతిని శ్రీనివాసరావు, కర్రి వెంకట సత్య నారాయణ, నిమ్మదల సన్యాసినాయుడు పాల్గొన్నారు.



పల్లె పండగలో పాల్గొన్న అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల

అనకాపల్లి : అనకాపల్లి మండలం కూండ్రం గ్రామంలో సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, సీసీ డ్రెయిన్ల నిర్మాణానికి స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ శనివారం భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో కూండ్రం సర్పంచ్ నందారపు లక్ష్మీ సూరిబాబు, జనసేన గ్రామ అధ్యక్షులు మరిడి నాయుడు పాల్గొన్నారు.

నక్కపల్లి : పల్లె పండగ కార్యక్రమంతో గ్రామాలు అభివృద్ధి కానున్నాయని రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. మండలంలోని చినదొడ్డిగల్లు గ్రామంలో జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ పల్లె పండుగలో పాల్గొని సిసి రోడ్డునిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ వైసిపి పాలనలో నిధులు, విధులు లేక నీరసించిపోయిన పంచాయతీలు, సర్పంచ్‌లు, ఇపుడు కూటమి ప్రభుత్వ పాలనలో చాలా సంతోషంగా ఉన్నారన్నారు.

నాతవరం : మండలంలో వైబి పట్నం గ్రామాల్లో పల్లెపండుగలో సిసిరోడ్లు, డ్రైనేజీలు, వివిధ అభివద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కూటమి నాయకులు సింగంపల్లి సన్యాసి దేముడు, కూండ్రపు అప్పలనాయుడు, ఎంపిటిసి లోకా లోవరాజు, సర్పంచ్ పైల రమేష్ నాయుడు,ఎపిఒ చిన్నారావు పాల్గొన్నారు.

గొలుగొండ : మండలంలోనిచోద్యం పంచాయతీలో రూ.30లక్షలతో సీసీ రోడ్ల పనులను స్థానిక సర్పంచ్ ఆదపురెడ్డి గోపాలకృష్ణ, మాజీ జెట్పీటీసి చిటికెల తారక వేణుగోపాల్ శంకుస్థాపన చేశారు. టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు అడిగర్ల సోమి నాయుడు, మండల బీసీ సెల్ అధ్యక్షులు దేవాడ శేషు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి నాతిరెడ్డి అప్పలనాయుడు, మాజీ ఎంపీటీసీ మాధవరావు, చెన్నారెడ్డి గ్రామస్థులు పాల్గొన్నారు. కసిమి గ్రామంలో సిసి రోడ్లకు శంకుస్థాపన చేశారు. సీనియర్ నాయకులు బాబురావు, బుచ్చిబాబు, యూత్ సభ్యుడు మహేష్, పాకలపాడు మాజీ సర్పంచ్ కామిరెడ్డి రామన్న, ఎల్లవరం గ్రామ సర్పంచ్ కొల్లు రాంబాబు, రావణాపల్లి సర్పంచ్ కొల్లు సత్యనారాయణ, ఏటిగైరంపేట సర్పంచ్ బిడిజాన రామకృష్ణ, తెలుగు యువత అధ్యక్షుడు కర్రి నాయుడు, మండల పార్టీ ఉపాధ్యక్షుడు కొల్లు గోవింద, కసిమి టీడీపీ నాయకుడు బాబురావు, గుండుపాల మాజీ సర్పంచ్ గుమ్మడి చిన్నబ్బాయి, గుండుపాల మాజీ ఎంపీటీసీ రవివర్మ, నల్లబెల్లి స్వామి, అల్లు స్వామి పాల్గొన్నారు. కొత్త ఎల్లవరంలో రూ. 10లక్షలతో సిసి రోడ్లుకు శంకుస్థాపన చేశారు. గ్రామ సర్పంచ్ కొల్లు రాంబాబ, గ్రామ పార్టీ అధ్యక్షుడు శెట్టి శివకుమార్ పాల్గొన్నారు.

పాల సేకరణ ధర తగ్గింపుపై పాడి రైతుల భగ్గు


మునగపాకలో ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న నేతలు, రైతులు

ప్రజాశక్తి- మునగపాక

విశాఖ డెయిరీ యాజమాన్యం ఆవు పాలు సేకరణ ధర తగ్గింపుపై జిల్లాలోని పలు ప్రాంతాల్లో రైతులు నిరసనలు చేపట్టారు. మునగపాక విశాఖ డెయిరీ పాల కేంద్రం వద్ద శనివారం డెయిరీకి పాలు పోస్తున్న పాడి రైతులు ఏపీ రైతు సంఘం సంఘం, సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. డెయిరీలో జరుగుతున్న అవినీతి, దుబారాను అరికట్టాలని, పెంచిన ఫీడ్ ధరలు తగ్గించాలని, రెండు సంవత్సరాలుగా నిలిపివేసిన బోనస్‌ను చెల్లించాలని, డెయిరీ యాజమాన్యం తగ్గించిన పాల ధరను తక్షణమే పునరుద్ధరించాలని ప్లకార్డ్ పట్టుకొని నినాదాలు చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎస్ బ్రహ్మాజీ, రైతులు కాండ్రేగుల తమ్ము నాయుడు, పెంటకోట వెంకట్, దాడి వీరబాబు, సూరిశెట్టి సత్తిబాబు, వేగ అప్పారావు పాల్గొన్నారు.

చూచుకొండలో..

మునగపాక : మండలంలోని చూచుకొండ విశాఖ డెయిరీ పాల సేకరణ కేంద్రం వద్ద పాడి రైతులు శనివారం నిరసన తెలిపారు. ఆవు పాలు ధర ఒకసారే రూ.3 తగ్గించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏటా బోనస్ రెండుసార్లు ఇచ్చేవారని, ఇప్పుడు ఒక్కసారికే పరిమితం చేశారని వాపోయారు. ఈ కార్యక్రమంలో పాల కేంద్రం డైరెక్టర్ కాండ్రేగుల చిన్న, పాడి రైతులు కాండ్రేగుల చంద్ర రావు, బొడ్డేడ నర్సింగరావు, కోరుబిల్లి నాగేశ్వరరావు, కాండ్రేగుల వెంకటి, పెంటకోట రఘురాం, కాండ్రేగుల శివ, పెంటకోట చిన్నునాయుడు, కాండ్రేగుల రాజు నాయుడు, చదరం వరా రామకృష్ణ పాల్గొన్నారు.


చూచుకొండ పాల కేంద్రం వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

నరసయ్యపేటలో...

చోడవరం : పాల సేకరణ ధర తగ్గించడాన్ని నిరసిస్తూ నరసయ్యపేట పాల కేంద్రం వద్ద శనివారం ఉదయం పాడి రైతులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ పాల సేకరణ ధరను తగ్గించడం వల్ల తామంతా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఖర్చులు పెరిగిపోవడం వలన ప్రస్తుతం ఇస్తున్న ధర ఏమాత్రం గిట్టుబాటు కావడం లేదని, ఇలాంటి సమయంలో ధర తగ్గించడం దారుణమన్నారు. కార్యక్రమంలో పాడి రైతులు పాల్గొన్నారు.

తగ్గించిన ధరలను పునరుద్ధరించకుంటే ఉద్యమం : సిపిఎం

అనకాపల్లి : విశాఖ డెయిరీ యాజమాన్యం ఆవు పాల సేకరణ ధరలను తగ్గించడం పట్ల సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం శనివారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. పశుపోషణ వ్యయం విపరీతంగా పెరిగినప్పటికీ విశాఖ డెయిరీ యాజమాన్యం పాలసేకరణ ధరలు పెంచకుండా తగ్గించడం దుర్మార్గమన్నారు. గత రెండేళ్లుగా పాడి రైతులకు బోనస్ ఇవ్వకుండా తీవ్ర ద్రోహం చేసిందని పేర్కొన్నారు. వెంటనే విశాఖ డెయిరీ యాజమాన్యం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని తగ్గించిన ఆవుల పాల ధరను పునరుద్ధరించక పోతే పాడిరైతులను సమీకరించి ఉద్యమిస్తామని లోకనాథం హెచ్చరించారు.


విశాఖ డెయిరీ ఎమ్‌డికి వినతిపత్రం ఇస్తున్న రైతు నేతలు

తగ్గించిన పాల సేకరణ ధరను పునరుద్ధరించాలని వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి : విశాఖ డెయిరీ యాజమాన్యం తగ్గించిన ఆవుపాల సేకరణ ధరలను తక్షణమే పునరుద్ధరించాలని డెయిరీ ఎమ్‌డికి ఆయన కార్యాలయంలో శనివారం ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్రాపు సూర్యనారాయణ, జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, నాయకులు ఎస్ బ్రహ్మాజీ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి విశాఖ విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలో అత్యధిక మంది రైతులు పాడిపైనే ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. సుమారు 3500 గ్రామాలకు చెందిన మూడు లక్షల మంది పాడి రైతులు పాల ఉత్పత్తి సంఘాల ద్వారా విశాఖ డెయిరీకి పాలను సరఫరా చేస్తున్నారని పేర్కొన్నారు. నేడు రైతులకు ఇస్తున్న ధరలు ఏమాత్రం లాభసాటిగా లేవని, ఆవుపాలకు లీటరుకు రూ.50, గేదె పాలు లీటరుకు రూ.100 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆవు పాలు ధరను లీటరుకు రూ.3తగ్గిస్తూ డెయిరీ తీసుకున్న నిర్ణయాన్ని తక్షణమే వెనక్కు తీసుకోవాలని కోరారు. గత రెండేళ్లగా ఇవ్వని బోనస్‌లు తక్షణమే చెల్లించాలని, పెంచిన ఫీడ్ ధరను తగ్గించాలని, డెయిరీ అక్రమాలపై విచారణ చేయించాలని కోరారు.


ఇవిఎం గొడౌన్ వద్ద అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు

ఇవిఎంల గొడౌన్ తనిఖీ

ప్రజాశక్తి- అనకాపల్లి : జిల్లా ఎస్‌పి కార్యాలయం ప్రాంగణంలో గల ఇవిఎం గొడౌన్‌ను డిప్యూటీ చీఫ్ ఎన్నికల అధికారి, రాష్ట్ర ఇవిఎం నోడల్ అధికారి కె.విశ్వేశ్వరరావు, జిల్లా కలెక్టరు, జిల్లా ఎన్నికల అధికారి విజయ క్రిష్ణన్‌తో కలిసి శనివారం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీ చేసారు. గొడౌను సీళ్లను, సిసి కెమెరాలు, భద్రతా ఏర్పాట్లను పరిశీలించి నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేసారు. అగ్నిమాపక పరికరాలను ఇవిఎం గొడౌను బయట కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ డివిజినల్ అధికారి బి.దయానిధి, ఆర్‌డిఓ షేక్ ఆయేషా, జిల్లా అగ్నిమాపక అధికారి ఆర్.వెంకటరమణ, అనకాపల్లి తహశీల్దారు విజయ కుమార్, ఎలక్షన్ సెక్షన్ సూపరింటెండెంటు ఎస్ఎస్‌వి.నాయుడు, టిడిపి ప్రతినిధి బి.శ్రీనివాసరావు, ఆప్ పార్టీ ప్రతినిధి కె.హరినాథ్ బాబు, సిపిఎం ప్రతినిధి అల్లు రాజు, బిజెపి ప్రతినిధి టి.నాగేశ్వరరావు, వైఎస్‌ఆర్‌పి ప్రతినిధి షణ్ముఖ్, ఐఎన్‌సి ప్రతినిధి టి.రమణ పాల్గొన్నారు.

వర్షాలు ఖరీఫ్ పంటలకు సానుకూలం

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలు ఖరీఫ్ పంటలకు సానుకూలంగా ఉన్నాయని అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం పరిశోధన సహ సంచాలకులు డాక్టర్ ముకుందరావు పేర్కొన్నారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో శనివారం శిక్షణ సందర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అనుకూల వాతావరణ పరిస్థితుల వలన వరి సాగు 105 శాతం, అపరాలు 75 శాతం, చిరుధాన్యాలు 67 శాతంగా నమోదైనట్లు చెప్పారు. ఈ సంవత్సరం జూన్ నెల నుండి ఇంతవరకు 11 శాతం అధిక వర్షపాతం నమోదైందని తెలిపారు. ఈ కారణంగా జిల్లా అధిక విస్తీర్ణం వరి సాగును రైతులు చేపట్టారన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి మోహనరావు మాట్లాడుతూ సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో జిల్లాలో కురిసిన వర్షాల వలన రాబోయే రబీ సీజన్లో అపరాలు, నువ్వులు వంటి పంటల సాగుకు అనుకూలంగా ఉంటుందని తెలిపారు. విశాఖ జిల్లా వ్యవసాయ అధికారి కే.అప్పల స్వామి మాట్లాడుతూ వరిలో ప్రధానంగా పాముపొడ తెగులు, ఆకుముడత పురుగు గమనించామని, ఇటీవల దోమ కనిపిస్తుందని తెలిపారు. ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు కెవి.రమణమూర్తి, టి.శ్రీలత, ఎం.విశాలాక్షి, పి.శ్రీదేవి, డి.ఉమా మహేశ్వరరావు వివిధ సమస్యలపై రైతులకు అవసరమైన సూచనలను అందజేశారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు జీవనియంత్రణ విభాగాన్ని సందర్శించి అవగాహన పొందారు.

చెస్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

ప్రజాశక్తి-అనకాపల్లి : ఉమ్మడి విశాఖపట్నం జిల్లా అండర్-14, అండర్ -17 బాల బాలికల చెస్ పోటీలకు ఎంపిక జరిగింది. స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శనివారం ఉమ్మడి విశాఖ జిల్లా చెస్ పోటీలు జీవీఎంసీ మెయిన్ హైస్కూల్‌లో నిర్వహించారు. ఉమ్మడి విశాఖ అనకాపల్లి అల్లూరి సీతారామరాజు జిల్లాల ఎంపికలో సుమారుగా 350 మంది బాలబాలికలు పోటీలలో పాల్గొన్నారు. ఇక్కడి విజేతల నుంచి ఉమ్మడి విశాఖ జిల్లా బాల బాలికల చెస్ జట్ల ఎంపిక జరుగుతుందని స్కూల్ గేమ్స్ సమాఖ్య కార్యదర్శి మోటూరి వెంకట నాగేశ్వరరావు, దేవుడు బాబు తెలియజేశారు.


చెస్ పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

జగన్‌కు ప్రతిపక్షమే సరైన స్థానం

ప్రజాశక్తి- అనకాపల్లి : వైసిపి అధినేత వైఎస్.జగన్‌కు గత ఐదు సంవత్సరాలలో చెప్పిన అబద్ధాలు, మోసాల వలన ప్రజలు ప్రతిపక్ష స్థానంలో కూర్చోబెట్టారని, ఆయనకు అదే స్థానం సరైనదని మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగ జగదీష్ అన్నారు. స్థానిక టిడిపి పార్లమెంటరీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వ ధనంతో సోకులు చేసుకోవడం తన సొంత ఇంటికి కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టి అధికార దుర్వినియోగం చేయడంతో ప్రజలు 11 స్థానాలకు పరిమితం చేశారని గుర్తు చేశారు. వచ్చే సంవత్సరంలో పూర్తిస్థాయిలో సూపర్ సిక్స్ అమలు అవుతాయని తెలిపారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కాండ్రేగుల సత్యనారాయణ బుద్ద కాశీ విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ లాంఛనాలతో జవాన్ అంత్యక్రియలు

ప్రజాశక్తి- కశింకోట : కశింకోట మండలం పరవాడపాలెం గ్రామంలో వీర జవాన్ పరవాడ నాయుడుబాబు (36) అంత్యక్రియలు శనివారం ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించారు. దేశ సరిహద్దుల్లో విధులు నిర్వహిస్తుండగా ఈ నెల 15వ తేదీన ఉదయం 7 గంటలకు గుండె పోటుతో నాయుడుబాబు కుప్ప కూలిపోయాడు. వెంటనే ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందితూ మృతి చెందారు. నాయుడుబాబు మృతదేహాన్ని అక్కడ నుండి విమానంలో ఢిల్లీకి, అక్కడ నుండి విశాఖకు తరలించి, స్వగ్రామానికి తీసుకొచ్చినట్లు నాయుడుబాబు అన్నయ్య భవానీ చెప్పారు. నాయుడుబాబు మృతదేహానికి శనివారం పరవాడపాలెంలో అంత్యక్రియలు నిర్వహించారు. నాయుడుబాబు తల్లి దండ్రులు గతంలో మృతి చెందారు. ఏడాది క్రితం ఆయనకు వివాహమైంది. భార్య భార్య వున్నారు. నాయుడు బాబు మృతి పట్ల పలు గ్రామాల సర్పంచ్‌లు, గ్రామస్తులు సంతాపం తెలిపారు.


నాయుడుబాబు మృతదేహానికి పూలమాల వేస్తున్న జవాన్లు

అభిజిత్ కార్మికుల వంటా వార్పు

పరిశ్రమ గేట్ వద్ద ఆరో రోజు కొనసాగిన ఆందోళన


వంటా వార్పు చేస్తూ నిరసన తెలుపుతున్న అభిజిత్ కార్మికులు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : అభిజిత్ ఫెర్రో టెక్ కంపెనీ యాజమాన్యం ప్రకటించిన లే ఆఫ్‌ను ఎత్తివేసి, కార్మికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు ఆరో రోజు ఆందోళన కొనసాగించారు. ఇందులో భాగంగా అభిజిత్ పరిశ్రమ వద్ద శనివారం కార్మికులు వంటా వార్పు కార్యక్రమంతో నిరసన వ్యక్తం చేశారు. వంట అయిన తరువాత కార్మికులు సహపంక్తి భోజనాలు చేశారు. యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమ సమస్యను పరిష్కరించాలని కోరారు. నేటికి ఆరు రోజులు కావస్తున్నా కంపెనీ యాజమాన్యం ప్రభుత్వం స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. యాజమాన్యంపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుని 1000 మంది కార్మికులను తిరిగి ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ రాము, చిప్పాడ గ్రామ సర్పంచ్ రాజాన నాయుడుబాబు మాట్లాడుతూ యాజమాన్యం ప్రకటించిన అక్రమ లే ఆఫ్ ను తీవ్రంగా ఖండించారు. కార్మికులతో సంప్రదించకుండా విధులకు హాజరైన కార్మికులను పరిశ్రమలోకే రానివ్వకపోవడం అన్యాయమన్నారు. దశలవారీగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అనిమిరెడ్డి ప్రశాంత్, పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

నిత్యావసరాల ధరలపై నిరసన

ప్రజాశక్తి- అనకాపల్లి : పెరిగిన నిత్యవసర సరుకుల ధరలను తక్షణమే తగ్గించాలని కోరుతూ ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యాన శనివారం ఆర్డీవో కార్యాలయం ముందు బైఠాయించి ఆర్డిఓ కుమారి ఆయేషాకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నేతలు మాట్లాడుతూ బియ్యం, గోధుమలు, పప్పు దినుసులు, వంట నూనెలు, కాయగూరల ధరలు ఆకాశాన్ని అంటుతుండడంతో సామాన్య మధ్యతరగతి ప్రజల జీవితం పెను భారమైందని ఆవేదన వ్యక్తం చేస్తారు. వెంటనే ప్రభుత్వం స్పందించి అడ్డు అదుపు లేకుండా పెరిగిపోతున్న నిత్యవసర సరుకుల ధరల అదుపు చేయాలని డిమాండ్ చేసారు. కార్యక్రమంలో నాయకులు డాక్టర్ చిన్నియాదవ్, సూదికొండ మాణిక్యాలరావు, ఆడారి బుచ్చిరాము, వాసుపల్లి తాతయ్యలు, బొబ్బిలి గోవిందరాజులు, ముగడ అప్పారావు, కొల్లు సత్యారావు, ఉప్పల సాయి, సత్యసాయి, బర్నికాన రేవతి పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణపై అలసత్వం వద్దు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : పారిశుధ్యం నిర్వహణపై అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా పంచాయతీ అధికారి ఆర్.శిరీషారాణి హెచ్చరించారు. బుచ్చయ్యపేట శివారు నేతవానిపాలెంలో పర్యటించిన ఆమె కేబీ రోడ్డు నుండి అంగన్వాడీ కేంద్రానికి వెళ్లే రహదారిలో చెత్తకుప్పల పేరుకుపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డిపిఓ స్వయంగా చీపురు పట్టి చెత్తాచెదారాలను తొలగించారు. జేసీబిలతో చెత్త కుప్పలను తొలిగించి ట్రాక్టర్లలో తరలించారు. ప్రతి శనివారం అధికారులు గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాల్సి ఉందని ఈవో లవరాజుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డు పక్క బహిరంగ మలవిసర్జనపై మండిపడ్డారు. రోడ్లపై బహిరంగంగా మనవిసర్జన చేసిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని ఈఓ లవరాజును ఆదేశించారు. గ్రామాల్లో దండోరా వేయించి బహిరంగ మలవిసర్జన చేస్తే కేసులు పెడతామంటూ ప్రజలకు హెచ్చరికలు జారీ చేయాలన్నారు. ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో ఆక్రమణలు తొలగించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ విజయలక్ష్మి, ఈవో లవరాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వెంకటరమణ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-కశింకోట : జనసేన పార్టీ నాయకులు మళ్ళ వెంకటరమణ (బాబు) పుట్టినరోజు వేడుకలు శనివారం మండలంలోని తాళ్లపాలెం గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఉల్లింగుల రమేష్ ఇంటి వద్ద ఘనంగా నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకష్ణ విచ్చేసి బాబును సాలువతో సత్కరించి కేక్ కట్ చేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు గొంతిన శ్రీనివాసరావు, పొన్నగంటి అప్పారావు, కర్రి వెంకట సత్య నారాయణ, సిదిరెడ్డి శ్రీనివాసరావు, కర్రి గోవింద, కలిగేట్ల సింహాద్రి, జెర్రిపోతుల నూకునాయుడు, నారిపల్లి ప్రసాద్ పాల్గొన్నారు.

మద్యం షాపులు రోడ్లపై పెట్టొద్దు : సిపిఎం

ప్రజాశక్తి-కె.కోటపాడు : మద్యంషాపులను రోడ్లపై పెట్టకుండా ఊరుకు దూరంగా పెట్టాలని, ఆ దిశగా ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న డిమాండ్ చేసారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కొత్తగా ఏర్పాటు చేసిన మద్యం దుకాణాల్లో పాత మద్యం, అధిక ధరలకు అమ్ముతున్నారని, ఎక్సైజ్ అధికారులు దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. కొత్త మద్యం దుకాణాలు అడ్డగోలుగా పెట్టారని, బడి, గుడి, కాంప్లెక్స్, ఊరు మధ్యలో పెట్టకూడదన్న నిబంధనలు పాటించలేదని పేర్కొన్నారు. అధికార కూటమి నాయకులు సిండికేట్‌గా మారినట్లు విమర్శించారు. మరో పక్కన ఒక్కో సీసాపై రూ.100 నుండి రూ.200 వరకు అదనపు ధరలకు బ్లాక్‌లో అమ్ముతున్నారని తెలిపారు. వెంటనే గుడి, బడి, కాంప్లెక్స్, ఊరు మధ్యన ఉన్న షాపులను తొలగించాని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు గండి నాయనబాబు, యర్రా దేముడు, ఈర్లె నాయుడుబాబు, వి.సూర్యనారాయణ, గాడి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికలో శివుని విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట మండలంలోని తాళ్లపాలెం జాతీయ రహదారి పక్కన ఉన్న హిందూ స్మశాన వాటికలో శివుని విగ్రహాన్ని శనివారం ఆవిష్కరణ చేశారు. గుమ్మడి సురేష్ కుమార్, గుమ్మడి మనోజ్ కుమార్ జ్ఞాపకార్థం వారి తాతయ్య గుమ్మడి సూర్యనారాయణ, కుటుంబ సభ్యులు సహకారంతో ఈ విగ్రహం ఏర్పాటు చేశారు. అచ్చుతాపురం వికలాంగుల ఆశ్రమం, కొండకర్ల ఆశ్రమంలో ప్రతి నెల ఒక్క రోజు భోజనం ఏర్పాటు చేస్తున్నామని కుటుంబ సభ్యులు తెలిపారు.

దీపావళి కానుకగా రైతులకు డివిడెండ్లు పంపిణీ

ప్రజాశక్తి-మునగపాక : దీపావళి కానుకగా రైతులకు 15శాతం డివిడెంట్లు పంపిణీ చేయనున్నట్లు స్థానిక పిఎసిఎస్ సీఈఓ ఆడారి వేణుగోపాలరావు తెలిపారు. శనివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ 2023-24 సంవత్సరానికి సంబంధించి రూ.4,82,755 మేర డివిడెంట్లు అందజేస్తామని తెలిపారు. సంఘ పరిధిలో 6019 మంది రైతులు ఉన్నారని, డిపాజిట్లు సేకరణ ద్వారా రూ.19,59,32,380 మేర రుణాలు అందజేశామన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట డిపిఎన్ బాలుర స్కూల్‌లో గ్రీన్ చారిటీస్ ఛారిటబుల్ ఆధ్వర్యాన శనివారం జరిగిన డ్రాయింగ్, వ్యాసరచన పోటీలలో గెలిపొందిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ప్రాధనోపాధ్యాయులు ఎన్‌విజె.ప్రసాద్, గ్రీన్ ట్రీస్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డి.సన్నిబాబు, ద్వారపురెడ్డి పరమేశ్వరరావు విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ భారాలు, స్మార్ట్ మీటర్లపై సిపిఎం నిరసనలు



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా నాయకులు ప్రభావతి

ప్రజాశక్తి- సబ్బవరం

ఇంధన సర్దుబాటు, ట్రూ అప్ ఛార్జీల పేరుతో భారాలు మోపడాన్ని నిరసిస్తూ, స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ సబ్బవరం మండల కేంద్రంలోని విద్యుత్ కార్యాలయం ఎదురుగా సిపిఎం మండల కార్యదర్శి ఉప్పాడ సత్యవతి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.ప్రభావతి మాట్లాడుతూ నూతన విద్యుత్ చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చి అధిక కరెంటు చార్జీలు చేయడం దారుణమన్నారు. ట్రూ ఆఫ్ చార్జీలు పేరుతో 2023 -24 సంవత్సరంలో వినియోగించిన విద్యుత్‌కు యూనిట్‌పై రూ.4 వరకు వసూలు చేయడం దారుణమన్నారు. తక్షణమే కరెంటు చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎం. గౌరేష్, వై. సోంబాబు, పి. కోటి ,భారతి తదితరులు పాల్గొన్నారు.



మాడుగులలో నిరసన

రాంబిల్లి : సిపిఎం ఆధ్వర్యాన శనివారం రాంబిల్లి మండల కేంద్రంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ జి.దేముడు నాయుడు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ హయాంలో విద్యుత్ చార్జీలు పెంచినప్పుడు, బాదుడే బాదుడు అంటూ ఆందోళనలు చేసిన టిడిపి, జనసేన నాయకులు, ఇప్పుడు అధికారంలోకి వచ్చాక జగన్ బాటలోనే విద్యుత్ భారాలు మోపడం దారుణమన్నారు. విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని, పేదలకు 200 యూనిట్లు వరకు ఉచితంగా ఇస్తామని నమ్మించి, నేడు విద్యుత్ భారాలు మోపడమంటే ప్రజలను మోసం చేయడమే అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సిహెచ్ రామకృష్ణ, డి కాశియా, వై రాము, కే లక్ష్మి, బి శ్రీనివాస్, చోడిపిల్లి గంగరాజు, నూకరాజు పాల్గొన్నారు.

పరవాడ : పరవాడ సినిమా హాల్ జంక్షన్లో సిపిఎం నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల నాయకురాలు పి మాణిక్యం మాట్లాడుతూ సర్దుబాటు చార్జీలు, ట్రూ ఆఫ్ చార్జీలు పద్ధతి ప్రపంచంలో ఎక్కడా లేదన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కే నాయుడు, బి లచ్చి బాబు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

చోడవరం : సిపిఎం ఆధ్వర్యంలో శనివారం మాడుగులలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి ఇ.నరసింహామూర్తి, నాయకురాలు భవాని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విద్యుత్ సంస్కరణలో భాగంగా ఈ భారాలు వేస్తున్నారని తెలిపారు. తక్షణమే ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకుంటే ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో బుసరి మల్లుదోర, బచ్చుల ఈశ్వరరావు, కోర్రా నాగర్జున, విజయశాంతి, అచ్చిబాబు, చిన్నారావు, బాలకృష్ణ, సన్యాసిరావు, మహిళలు పాల్గొన్నారు.



మధురవాడలో నిరసన తెలుపుతున్న సిపిఎం నేతలు, ప్రజలు

మధురవాడ : ట్రూ అప్ చార్జీల రూపంలో ప్రజలపై భారాలు వేయడానికి చేసిన ప్రతిపాదనలు వెనక్కి తీసుకోవాలని కోరుతూ మధురవాడలోని ఎపిఇపిడిసిఎల్ జోన్- 3 కార్యాలయం ఎటుద శనివారం సిపిఎం జోన్ కమిటీ ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. ప్లకార్డులు ప్రదర్శించి, విద్యుత్ భారాలు వేసే ప్రతిపాదనలకు వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. సిపిఎం జోన్ కార్యదర్శి డి.అప్పలరాజు మాట్లాడుతూ, తాము గెలిపిస్తే కరెంటు చార్జీలు పెంచబోమని చంద్రబాబు హామీ ఇచ్చారని, దానిని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం ఇఇ పి.శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి.రాజ్‌కుమార్, కె.నాగరాజు, ఎస్.పైడితల్లి, ఎ.గురుమూర్తిరెడ్డి, సిహెచ్.శేషుబాబు, డి.కొండమ్మ, బి.భారతి, పుష్ప, కె.పద్మ, ఆర్.జగదీష్, టి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.



రాంబిల్లిలో..

కోర్టుల్లో 'స్వచ్ఛతా హీ సేవా'

ప్రజాశక్తి- అనకాపల్లి

అనకాపల్లి కోర్టు సముదాయంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. పదో అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీవిద్య దీనిని ప్రారంభించారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు, సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది సహకారంతో కోర్టు మొత్తం క్లీన్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయమూర్తి మాట్లాడుతూ ఆరోగ్యం అన్నింటి కన్నా ముఖ్యమని, మన పరిసరాలను ఎప్పుడు శుభ్రం గా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జ్ ధర్మారావు, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జ రమేష్, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జ విజయలక్ష్మి, అధ్యక్షులు ఎం జె వి ఎన్ కుమార్, సెక్రెటరీ దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.



చోడవరం కోర్టు వద్ద పరిశుభ్రత పనులు చేస్తున్న దృశ్యం

చోడవరం : స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా శనివారం చోడవరం కోర్టు సమదాయంలో పరిశుభ్రత పనులు చేపట్టారు. ఈ సందర్భంగా 9వ అదనపు జడ్జి కే రత్నకుమారి, మెజిస్ట్రేట్ సూర్యకళ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే అనేక రకాల వ్యాధులకు దూరంగా ఉండవచ్చని చెప్పారు. పిల్లలకు ప్రాథమిక స్థాయి నుండి పరిశుభ్రత అలవాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బార్ కౌన్సిల్ అధ్యక్షులు డేవిడ్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణానికి నిధులు కొరత లేదు

ప్రజాశక్తి- వడ్డాది

ప్రభుత్వం మంజూరు చేసే ఇళ్ల నిర్మాణాలకు నిధుల కొరత లేదని గృహ నిర్మాణ శాఖ అనకాపల్లి జిల్లా పీడీ వై.శ్రీనివాసరావు అన్నారు. బుచ్చయ్యపేట మండలం వడ్డాదిలోని హౌసింగ్ కాలనీ లేఅవుట్లను శనివారం ఉదయం డిఈఈ ఎస్విఎస్ శ్రీనివాసరావుతో కలిసి ఆయన పరిశీలించారు. అసంపూర్తి నిర్మాణంలో ఉన్న ఇళ్ల వద్దకు వెళ్లి లబ్ధిదారులతో మాట్లాడారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బిల్లుల పెండింగ్‌పై స్థానిక హౌసింగ్ అధికారులతో ఆరా తీశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకంలో పేదలందరికీ ఇల్లు నిర్మించేందుకు కృషి చేస్తుందన్నారు. గతంలో నిలిచిపోయిన హౌసింగ్ బిల్లులపై కూడా తమ సిబ్బంది వివరాలు సేకరిస్తున్నారని చెప్పారు. ఇల్లు నిర్మించుకున్న ప్రతి ఒక్కరికి సకాలంలోనే బిల్లులు విడుదల చేస్తున్నామన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధులు తక్షణమే విడుదలయ్యేలా చూడాలని స్థానిక హౌసింగ్ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఈ అనిల్, టౌన్ టిడిపి అధ్యక్షుడు దొండా నరేష్, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

తాతయ్యబాబును కలిసిన హౌసింగ్ పీడీ

బుచ్చయ్యపేట : రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన బత్తుల తాతయ్యబాబును శనివారం అనకాపల్లి జిల్లా హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు, చోడవరం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, హౌసింగ్ డిపార్ట్మెంట్ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి శాలువాతో సత్కరించారు.



ఎమ్మెల్యే రాజును గజమాలతో సత్కరిస్తున్న దృశ్యం

ఘనంగా ఎమ్మెల్యే రాజు పుట్టిన రోజు వేడుకలు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : చోడవరం శాసనసభ్యులు కెఎస్ఎన్ఎస్.రాజు పుట్టిన రోజు వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. బుచ్చయ్యపేట మండలానికి చెందిన టిడిపి నాయకులు రాజును కలిసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఎమ్మెల్యే రాజును గజ మాలతో సత్కరించారు. కార్యక్రమంలో విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, టిడిపి మండల అధ్యక్షులు గోకివాడ కోటేశ్వరరావు, నాయకులు డొంక్కిన అప్పలనాయుడు, తమరాన దాసు, కోటా సత్యనారాయణ, కోరుకొండ రవికుమార్, దేవర అప్పారావు, సాయం శేషు పాల్గొన్నారు.

జనావాసాల మధ్య మద్యం షాపులు సరికాదు

ప్రజాశక్తి-చోడవరం : మండలంలోని గోవాడ గ్రామంలో జనావాసాల మధ్య బ్రాందీ షాపు ఏర్పాటు చేయడం సరికాదని జనసేన జిల్లా కార్యదర్శి అల్లం రామ అప్పారావు అన్నారు. ఈ విషయంపై శనివారం ఎక్సైజ్ సీఐకు వినతి పత్రం అందించారు. గ్రామ నడిబొడ్డున రెండు ఆలయాల మధ్య బ్రాందీ షాపు ఉంటే దానిని తీసివేయాలని అప్పట్లోనే అధికారులకు ఫిర్యాదు చేసినట్లు రామ అప్పారావు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత ప్రైవేటు బ్రాందీ షాపును అదే స్థలంలో ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

విద్యార్థులకు యోగాపై అవగాహన

ప్రజాశక్తి-సబ్బవరం : ఫిట్ ఇండియా ఫ్రీడమ్ రన్ 5.0 ఈవెంట్‌లలో భాగంగా ఐఐపిఇ వారు యోగా విలేజ్‌లో యోగాపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఇనిస్టిటూట్ రిజిస్ట్రార్ రాంపాల్ దివేది, యోగా గురు ప్రొఫెసర్ తులసిరావు, నోడల్ అధికారి రంధి రామునాయుడు, స్పోర్ట్స్ అధికారి జి వెంకటేశ్వరరావు మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎ.నరసింహారావు పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



కొత్తకోటలో వినతులు స్వీకరిస్తున్న అధికారులు

ప్రజాశక్తి -కొత్తకోట : రావికమతం మండలం కవగుంట పంచాయతీ శివారు బుడ్డిబంద గ్రామంలో శనివారం రెవెన్యూ రైతు సదస్సు నిర్వహించా.గ్రామ సర్పంచ్ దాసరి సూర్య కుమారి వరహాలు అధ్యక్షతన తహసీల్దార్ బి. వెంకటరమణ మాట్లాడుతూ రైతులు తమ సమస్యల పరిష్కారం కోసం ఈ సదస్సు వినియోగించుకోవాలని సూచించారు. గత ప్రభుత్వంలో జగనన్న భూహక్కు,భూ రక్ష పథకంలో భాగంగా నిర్వహించిన రీసర్వేలో ఎక్క డైనా అవకతవకలుంటే వాటిపై దరఖాస్తు చేసుకోవాలని, పరిశీలించి పరిష్కరిస్తామన్నారు.కార్యక్రమంలో ఆర్ఐ సతీష్, విఆర్ఒ మూర్తి, పలువురు రైతులు పాల్గొన్నారు.

నాతవరం : మండలంలో సమ్మచింత పంచాయతీ పొట్టి నాగన్నదొరపాలెం గ్రామంలో రీసర్వే భూ సమస్యల పరిష్కార గ్రామసభ నిర్వహించారు. తహశీల్దార్ ఎ.వేణుగోపాల్ మాట్లాడుతూ రీసర్వేలో తప్పులుంటే దరఖాస్తు చేసుకోవాలని, ఆయా సమస్యలను వెంటనే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో రీ సర్వే డిటి. వి. శివ, మండల సర్వేయర్ టిడి ప్రసాద్, చమ్మచింత సర్పంచ్ వెలగాడ కొండబాబు, టిడిపి నాయకులు అప్పన సత్యనారాయణ, విఆర్ఒ ఆర్విఎస్ఎస్ఎన్ మూర్తి గ్రామ సర్వేయర్ భవాని, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కశింకోట : మండలంలో చింతలపాలెంలో తహశీల్దారు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శనివారం రెవెన్యూ గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూముల రీసర్వే సందర్భంగా జరిగిన వివిధ రకాల తప్పులపై ఈ గ్రామసభల్లో అర్జీలు పెట్టుకుంటే 15 రోజుల్లో పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మండల సర్వేరు రామారావు, ఆర్ఐ రమేష్, వీఆర్వో అజిత్, గ్రామ సర్వేర్ ప్రసాద్, నాయకులు జెర్రిపోతుల నూకునాయుడు, కోన రమణ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మునగపాక : భూముల రీ సర్వేల్లో తప్పులపై జరుగుతున్న గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ దిమ్మల అప్పారావు కోరారు. స్థానిక పంచాయతీ కార్యాలయం ఆవరణలో జరిగిన రెవెన్యు గ్రామసభలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మార్వో ఆదిమహేశ్వరరావు, కూటమి నాయకులు మొల్లేటి సత్యనారాయణ, వేగి కృష్ణ, ఎవి సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పరవాడ : మండలంలోని కలపాక గ్రామంలో జరిగిన గ్రామసభలో రీ సర్వేపై అభ్యంతరాలను రైతుల నుండి వినతులు స్వీకరించారు. కలపాక రెవెన్యూలో ఉన్న ప్రభుత్వ భూములను పరిరక్షించాలని ఈ.బోనంగి రెవెన్యూ, కె.గొర్లివానిపాలెం గ్రామ నివాసి చిప్పాడ రామారావు తహశీల్దారు ఎస్వి అంబేద్కర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ఎస్.సన్యాసిరావు, కె.సురేష్ ,బి.శీను, రమణ, జి.శీను తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని అసకపల్లి గ్రామంలో శనివారం జరిగిన రెవిన్యూ సదస్సులో భూ రీ సర్వే సమస్యలపై 81 అర్జీలు అందినట్లు స్థానిక తహసీల్దార్ బి.చిన్నికృష్ణ తెలిపారు. వీటిపై దర్యాప్తు చేసి తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో రీ సర్వే డిటి గణేష్, మండల సర్వేయర్ అప్పారావు, సర్పంచ్ కర్రి నర్సింగరావు, ఎంపిటీసీ కర్రి అప్పారావు, వీఆర్వో డి. ఈశ్వరరావు, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



కశింకోటలో వినతులు స్వీకరిస్తున్న అధికారులు

త్రుటిలో తప్పిన ప్రమాదం



తుప్పల్లోకి దూసుకెళ్లిన ఆర్టీసి బస్సు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : చింతపల్లి నుండి నర్సీపట్నం వస్తున్న ఆర్‌టిసి బస్సుకు డౌనూరు వద్ద వద్ద త్రుటిలో ప్రమాదం తప్పిందని నర్సీపట్నం ఆర్‌టిసి డిపో మేనేజర్ ధీరజ్ తెలిపారు. ఎదురుగా వస్తున్న కారును డ్రైవర్ తప్పించే క్రమంలో బస్సు తుప్పల్లోకి దూసుకుపోయిందని, డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో 40 మంది ప్రయాణికులకు ఎటువంటి ప్రమాదం జరగలేదని తెలిపారు. అలాగే కారులో ఉన్న ప్రయాణికులకు ఎటువంటి ప్రమాదం జరగలేదన్నారు. తర్వాత వేరొక బస్సులో ప్రయాణికులను నర్సీపట్నం తరలించామన్నారు. ప్రమాదానికి గురైన బస్సును పొదల నుండి బయటకు తీశామన్నారు. పూర్తి పరిశీలన చేసి దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కెజిబివి విద్యార్థినులు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన కస్తూర్బా బాలికలు

ప్రజాశక్తి -ఆనందపురం: ఆనందపురం మండలం నేలేరులోని కస్తూరిబా గాంధీ పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఇన్చార్జ్ ప్రిన్సిపల్ నాగమణి తెలిపారు. విశాఖపట్నం ఇందిరాప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన ఎస్‌జిఎఫ్ఐ జిల్లా స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. పాఠశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎం.సునీత అండర్ 19 హ్యాండ్ బాల్‌లోనూ, ప్రథమ సంవత్సరం చదువుతున్న ఎస్.అరుణ నెట్ బాల్‌లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారని వివరించారు. వీరికి గైడ్ టీచరుగా రమాదేవి వ్యవహరించారని పేర్కొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను డిఇఒ చంద్రకళ, జిసిడిఒ డాక్టర్ కలిసా బేగం, ఇన్చార్జ్ ప్రిన్సిపల్ నాగమణి, పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మన్ శివాజీ, విద్యార్థులను అభినందించారు.

వ్యవసాయానికి ఆధునికత జోడించాలి



పొలం పిలుస్తుందిలో కలెక్టర్‌తో పాల్గొన్న హోంమంత్రి అనిత

ప్రజాశక్తి -నక్కపల్లి : వ్యవసాయానికి ఆధునికత జోడిస్తే ఆరోగ్యకరమైన మంచి దిగుబడులను సాధించవచ్చని రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. మండలంలోని చినదొడ్డిగల్లు గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో హోంమంత్రి వంగలపూడి అనిత, జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ పాల్గొన్నారు. క్షేత్రస్థాయిలో నిర్వహించిన వరిలో ఎరువులు, పురుగు, తెగుళ్ల మందులు పిచికారీ విధానాన్ని పరిశీలించారు. డ్రోన్ ద్వారా ఒక ఎకరానికి ఏడు నిమిషాల్లో పిచికారీ చేయవచ్చునని, ఒక ఎకరానికి రైతుకు రూ.400 ఖర్చు అవుతుందని, వేగవంతంగానూ, సులభతరంగా మెరుగైన ఉత్పాదకత ,అధిక రాబడితో పాటు, ద్రావణం వృథా కాదన్నారు. వ్యవసాయ శాఖ ద్వారా అమలు అవుతున్న వివిధ పథకాలు గురించి వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్ వివరించారు. కార్యక్రమంలో కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సీనియర్ మేనేజర్ పృధ్వీ , నాయకులు పాల్గొన్నారు.

పోలవరంలో రెవెన్యూ గ్రామసభ

ప్రజాశక్తి-గొలుగొండ :మండలంలో పోలవరం రెవెన్యూ గ్రామంలో తహశీల్దార్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రీ సర్వే రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ సర్వే సమయాల్లో ఏమైనా లోపాలు ఉన్నట్లయితే వాటిని తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అటువంటి సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ చైనులు, మండల సర్వేయర్ సత్యనారాయణ, రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ నాగరాజు పలువురు అధికారులు పాల్గొన్నారు

ఐదేళ్లలో కుంటుపడిన మున్సిపాలిటీ అభివృద్ధి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : నర్సీపట్నం మున్సిపాలిటీలో గడచిన ఐదేళ్లలో అభివృద్ధి కుంటుపడిందని రాష్ట్ర శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు సతీమణి మున్సిపల్ కౌన్సిలర్ పద్మావతి ఆవేదన వ్యక్తం చేశారు. శనివారంమున్సిపాలిటీ కార్యాలయంలో డస్ట్ బిన్‌ల పంపిణీలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గెలిచిన మూడు నెలల కాలంలో మున్సిపాలిటీకి సుమారు రూ.5 కోట్లతో అభివృద్ధి పనులకు వర్క్ ఆర్డర్లు రావటం గర్వంగా ఉందన్నారు. గత ప్రభుత్వంలో మున్సిపల్ అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా తెచ్చుకోలేకపోయామన్నారు. గత ప్రభుత్వంలో వార్డుల్లో వీధిలైట్లు వెలగని పరిస్థితి ఉండగా, మూడు నెలల కాలంలో ప్రతి వార్డులోనూ వీధిలైట్లు వెలుగుతున్నా యన్నారు.

స్పీకర్ అయ్యన్నపాత్రుడు పార్టీలకు అతీతంగా ప్రతి వార్డు అభివృద్ధికి కృషి చేస్తున్నారని కౌన్సిలర్ పద్మావతి చెప్పారు. అనంతరం మున్సిపాలిటీ కార్యాలయంలో పుష్కాట్లకు ఉండే డస్ట్ బిన్లు సచివాలయం పారిశుద్ధ్య విభాగానికి పద్మావతితోపాటు మున్సిపల్ చైర్మన్ సుబ్బలక్ష్మి అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జె సురేంద్ర, శానిటరీ ఇన్స్పెక్టర్ చిట్టిబాబు, వార్డు కౌన్సిలర్లు ధనిమిరెడ్డి మధు, రాజుల నాయుడు, డబ్బీర్ శ్రీకాంత్, పైలా గోవిందు, రుత్తల కన్న, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



డస్ట్ బిన్ పంపిణీ చేస్తున్న పద్మావతి, తదితరులు

సంత ప్రాంగణంలో పారిశుద్ధ్య పనులు



పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తున్న ప్రత్యేకాధికారి లక్ష్మి

ప్రజాశక్తి-నాతవరం : మండల కేంద్రంలో స్వచ్ఛతాహి సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో సంత ప్రాంగణంలో పారిశుద్ధ్య పనులు చేపట్టి, శుభ్రం చేశారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి జివి.లక్ష్మీ మాట్లాడుతూ ప్రతి శనివారం స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు కార్యక్రమంలో ఇఓపిఆర్‌డి ఎన్.వి.ఎస్ మూర్తి, పంచాయతీ కార్యదర్శులు శేషు, బి.రామేష్ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు

దేశ ఉజ్వల భవిష్యత్తుకు విద్యార్థులే మూలం



నైపుణ్య శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

ప్రజాశక్తి -ఆనందపురం : దేశ ఉజ్వల భవిష్యత్తుకు విద్యార్థులే మూలమని మహలక్ష్మి కల్చర్ అసోసియేషన్ అధినేత ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్ అన్నారు. మండలంలోని గిడిజాల పాఠశాలలో శనివారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్ ఆధ్వర్యాన 7, 8, 9, 10 తరగతి విద్యార్థులకు నైపుణ్య శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశ ప్రతిష్ఠను నలుమూలల వ్యాపించ చేసే దిశగా తయారవగల సత్తా విద్యార్థులకే ఉందన్నారు. భవిష్యత్తు కాలంలో పోటీ పరీక్షలకు చదువే ముఖ్యమని తెలిపారు. పాఠశాలలో పదో తరగతిలో 585 మార్కులు దాటిన విద్యార్థులకు ఇంజనీరింగ్ వరకు పూర్తి చదువుకయ్యే బాధ్యత వహిస్తానని ఈ సందర్భంగా తెలిపారు. పాఠశాలలో నిర్వహించిన పరీక్షల్లో అత్యుత్తమైన ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సకాలు అందించారు. ఇందులో భాగంగా మొదటి బహుమతి హనీ, రెండో బహుమతి కౌశిక్, దీక్షిత చైతన్య, మూడో బహుమతి మహేష్ బాబు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఎల్ఎస్ఎన్.పాత్రుడు, కోరాడ వైకుంఠరావు, వెంకట్రావు, ఈశ్వరరావు, ఎంపిటిసి మాజీ సభ్యులు ఎర్ర రాము, భగవాన్, ఫణీంద్ర, శ్యామ్, వెంకటేశ్వర్లు శిరీష్, రౌతు శ్రీను, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇసుక సరఫరా ప్రారంభం



ఇసుక సరఫరా ప్రారంభిస్తున్న అధికారులు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : గబ్బాడ డిపో నుంచి ఇసుక సరఫరాను శనివారం రాత్రి పున:ప్రారంభించారు. మైనింగ్ ఏడీ శివాజీ, అధికార పార్టీ నాయకులు టిడిపి పట్టణ ప్రధాన కార్యదర్శి గవిరెడ్డి వెంకట రమణ, కౌన్సిలర్ ధనిమిరెడ్డి మధు, డబ్బీర్ శ్రీకాంత్, ఈర్లి రాజబాబు తదితరులు ఇసుక సరఫరాను ప్రారంభించారు. గత ప్రభుత్వ హయాంలో అక్రమ ఇసుక నిల్వలపై అధికారులు విచారణ చేపట్టారు.ప్రతిమ ఇన్ఫ్రా కంపెనీకి రూ. 18 కోట్లు జరిమానా విధించారు. దీనిపై విచారణ కొనసాగడంతో ఇన్నాళ్లు ఇసుక సరఫరా నిలిచింది. అయితే స్పీకర్ ఆదేశాలతో ఇసుక సరఫరా సమస్యలను పరిష్కరించారు. రవాణా ఖర్చులకు టన్నుకు రూ. 1,165 ధరగా నిర్ణయించారు. ఇసుకను కేవలం నిర్మాణ అవసరాల కోసం మాత్రమే విక్రయిస్తామని అధికారులు తెలిపారు. గబ్బాడ డిపోలో ప్రస్తుతం 48,204 టన్నుల ఇసుక నిల్వలు ఉన్నట్లు అధికారులు ప్రకటించారు. ఇసుకను వ్యాపారం చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని అధికార యంత్రాంగం హెచ్చరించింది.

అభిజిత్ కార్మికుల గోడు పట్టదా ?

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

సెజ్‌లొస్తే ఉద్యోగాలొస్తాయని భ్రమపెట్టి, మోసగించో, భయపెట్టో రైతుల నుంచి భూములు తీసుకున్న ప్రభుత్వాల అసలు నైజం బయటపడుతోంది. సెజ్‌లొచ్చిన చోట రైతులు, పేదల భూములు పోయాయేగానీ.. వారి జీవితాలు మెరుగుపడలేదు. ప్రభుత్వమేదైనా పరిశ్రమాధిపతుల కొమ్ముకాయడమేకానీ సర్వస్వమూ కోల్పోయిన ప్రజల పక్షాన నిలవడంలేదు. ఎగుమతి, దిగుమతి సుంకాలు, వివిధ పన్నుల రాయితీలు పొందిన యజమానులు ఆ పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికుల యోగక్షేమాలు పట్టించుకోవడంలేదు. కనీస ముందస్తు సమాచారం లేకుండా అచ్యుతాపురం సెజ్‌లోని అభిజిత్ ఫెర్రోటెక్ పరిశ్రమను మూసేసిన యాజమాన్య చట్ట వ్యతిరేక చర్యలను తప్పుపట్టి, కార్మికులకు న్యాయం చేసే పని ప్రభుత్వ యంత్రాంగం చేయడంలేదు. కోట్ల రూపాయల రాయితీలు పొంది, రెప్పపాటులో పరిశ్రమను మూసేసిన యాజమాన్యాన్ని ప్రాసిక్యూషన్ చేయాలి. ఆ పని చేయడం లేదు. అక్రమంగా లే ఆఫ్ ప్రకటించిన యాజమాన్యానికి పరిశ్రమను తెరిపించి కార్మికులకు పని కల్పించాలని వినుకొనేలా చెప్పడంలేదు. సోమవారం కంపెనీ లే ఆఫ్ ప్రకటించినా ఈ రోజు వరకూ కార్మిక, పరిశ్రమల శాఖాధిపతులు జోక్యం చేసుకోలేదు. సెజ్‌లో భూములు కోల్పోయిన కార్మికులే ఈ పరిశ్రమలో 70 శాతానికి మించి పనిచేస్తున్నారు. పరిశ్రమ మూయడంతో



కుటుంబాల పోషణ కార్మికులకు అగమ్యగోచరంగా వుంది. లే ఆఫ్ నోటీసును గేటుకు అంటించి యాజమాన్యం పరారైనప్పటి నుంచి పరిశ్రమను తెరిపించి పని కల్పించాలని కార్మికులు ఆందోళన చేస్తున్నా ప్రభుత్వ యంత్రాంగం చెవికెక్కడంలేదు. జనసేన యలమంచిలి ఎమ్మెల్యే విజయ్‌కుమార్, బిజెపి అనకాపల్లి ఎంపీ సిఎం రమేష్ కార్మికుల తరపున మాట్లాడిన సందర్భమూ లేదు. అధికార, ప్రతిపక్ష పార్టీల విస్మరణకు గురైన కార్మికుల తరపున ఆది నుంచీ సిఐటియు పోరాడుతోంది. సిపిఎం తన సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఇవి తీసుకున్న చొరవలో ఒక్క శాతమూ అధికార కూటమి నాయకులు తీసుకోకపోవడం విచారకరం. సెజ్‌లో పరిశ్రమలకు నష్టాలేకపోయినా వున్నట్లు చూపి, ప్రచారంచేసి కార్మికులను తగ్గించడం, తొలగించడం వంటి విపరీత చర్యలకు కంపెనీలు వెళ్తున్నాయి. ప్రభుత్వాల అండచూసుకొని తలబిరుసుతో ప్రవర్తిస్తున్నాయి. కార్మికులను మనుషులు గా చూసే మానవీయత కరువవుతోంది. సెజ్‌లో కార్మిక సంఘాల ఏర్పాటుకు అడ్డంకిగావున్న నిబంధనలను ఐక్య పోరాటాలతో నిలువునా పాతిపెట్టాలి. కార్మికుల సంక్షేమం, ప్రయోజనాలు కాపాడే కార్మిక సంఘాలు పెట్టుకోనేందుకు అడుగులు పడాలి. ఆ ప్రయత్నం సఫలీకృతమైనప్పుడే కార్మికులకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, ఇఎస్ఐ, పిఎఫ్, వారాంతపు సెలవులు, రక్షణ చర్యలు సొంతమవుతాయి. యజమాన్యాలు తోకముడిచి కార్మిక చట్టాల అమలుకు కొంచెమైనా ఆలోచిస్తాయి.

ముస్లిం, మైనార్టీలకు కూటమి అండ

రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత



.సర్పంచ్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న అనిత

ప్రజాశక్తి,-నక్కపల్లి : ముస్లిం, మైనార్టీలకు అండగా కూటమి ప్రభుత్వం ఉంటుందని రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. శనివారం మండలంలోని పెద్దబోదుగల్లం గ్రామంలో గ్వార్వి షరీఫ్ ఉరుసు ఉత్సవంలో పాల్గొని ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. అనిత సమక్షంలో వైసిపి సర్పంచ్ షేక్ మున్నిషాతో పాటు పలువురు టిడిపిలో చేరారు. అనిత పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ సర్పంచ్ షేక్ మున్నిషాకు పూర్తిగా అండగా నిలుస్తామని, గ్రామ అభివృద్ధికి తోడ్పాటును అందిస్తామన్నారు. పలు అభివృద్ధి పనులకు ప్రస్తుతం రూ. 20 లక్షలు నిధులు మంజూరు చేస్తున్నామని ప్రకటించారు. గత ప్రభుత్వంలో పెద్దబోదుగల్లం గ్రామాన్ని పట్టించుకోలేదన్నారు. ఎమ్మెల్యే,ఎంపీల చుట్టూ తిరిగినా అప్పట్లో పట్టించుకోలేదని, ఇపుడు కూటమి పాలనలో గ్రామాలు, ఇంటి వద్దకే నిధులు వస్తున్నాయన్నారు. వైసిపి ప్రభుత్వం లో అప్పటి ముఖ్యమంత్రి జగన్ ముస్లిం, మైనార్టీలను జగన్ గాలికి వదిలేసారన్నారు. పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ పాల్గొన్నారు.

హాస్టళ్లలో సౌకర్యాలపై ఆరా



హాస్టళ్ల సందర్శనలో సీనియర్ సివిల్ జడ్జి షియాజీఖాన్

ప్రజాశక్తి- నాతవరం : మండలంలోని చమ్మచింత పంచాయతీ కురువాడ గ్రామంలో గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను, చమ్మచింత సోషల్ వెల్ఫేర్ బాలుర హాస్టల్‌ను అలాగే రావులపాలెం ట్రైబల్ వెల్ఫేర్ గిరిజన బాలురు ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసిన నర్సీపట్నం సబ్ కోర్ట్ సీనియర్ సివిల్ జడ్జ్ పఠాన్ షియాజ్‌ఖాన్ సందర్శించారు.వసతి గృహల్లో విద్యార్థులతో మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు పెడుతున్న ఆహార పదార్థాలను తనిఖీ చేశారు. వంటగదిని మరుగుదొడ్లను పరిశీలించారు. కార్యక్రమంలో కోర్టు సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు


రూ.34.26 కోట్లతో

ఉపాధి ప్రణాళిక రూపకల్పన

ప్రజాశక్తి -రోలుగుంట : ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రూ.34 కోట్ల26లక్షల 41వేల రూపాయల బడ్జెట్ రూపకల్పన చేసినట్లు జాతీయ ఉపాధి హామీ పథకం ఎపిఒ ఈశ్వరరావు తెలిపారు. శనివారం మాట్లాడుతూ అక్టోబర్ 7వ తేదీ నుండి నవంబర్ 25వరకు మండలంలో 24 పంచాయతీ గ్రామాల్లో గ్రామసభల ద్వారా వేతనదారులకు బడ్జెట్ ప్రణాళిక వేస్తున్నామన్నారు. వ్యవసాయ పనులకు సంబంధించి 60 శాతం గుర్తించాలని, జనరల్ వర్కులకు 40 శాతం గుర్తిస్తున్నామన్నారు. ఫారంపండ్స్ చెరువుల్లో పూడికతీత, పంట కాలువల్లో పూడికతీత, ఊట గుంటలు తవ్వడం, అలాగే ప్రతీ గ్రామంలో నీరు నిల్వ ఉండకుండా ఇంకుడుగుంతలు మండలానికి 1000 టార్గెట్ ఇవ్వడం జరిగిందన్నారు. రైతులకు పండ్ల తోటల పెంపకంలో భాగంగా జీడిమామిడి, జిమ్మ, కొబ్బరి, సపోట వివిధ రకాల మొక్కలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. వీటి నిర్వహణ ఖర్చులు ఎకరానికి రూ.లక్షా 20వేలను వారి అకౌంట్లలో వేయనున్నట్లు చెప్పారు. చిన్న, సన్నకారు రైతులు వీటిని వినియోగించుకోవాలన్నారు.

వరద బాధితులకు విరాళాల వెల్లువ

● ముఖ్యమంత్రి సహాయనిధికి సాయం చెక్కుల అందజేత



లోకేష్‌కు చెక్ అందజేసిన ఎయు విసి, రిజిస్ట్రార్

వైజాగ్ ఫిలింనగర్ కల్చరల్ సెంటర్ రూ.25లక్షల సాయం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్/ సీతమ్మధార : విజయవాడ వరద బాధితుల సహాయార్థం వైజాగ్ ఫిలింనగర్ కల్చరల్ సెంటర్ తరపున ఆ సంస్థ గౌరవాధ్యక్షుడు కాయల వెంకట రెడ్డి రూ.25 లక్షల చెక్కును మంత్రి లోకేష్‌కు శనివారం టిడిపి కార్యాలయంలో అందజేశారు.విరాళాన్ని అందజేసిన కల్చరల్ సెంటర్ సభ్యులకు లోకేష్ కృతజ్ఞతలు తెలిపారు.

ఎయు రూ.79.95 లక్షల విరాళం


ఎంవిపి కాలనీ : ముఖ్యమంత్రి సహాయనిధికి ఆంధ్రవిశ్వవిద్యాలయం నుంచి రూ.79,95,116 విరాళం అందించింది. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను కలిసిన ఎయు విసి ఆచార్య జి.శశిభూషణరావు, రిజిస్ట్రార్ ఆచార్య ఇఎన్ ధనుంజయరావు విరాళం చెక్కును అందజేశారు. వరద బాధితుల సహాయార్థం ఎయు బోధన, బోధనేతర ఉద్యోగులు, పెన్షనర్లు స్వచ్ఛందంగా ఈ సాయం అందించినట్లు మంత్రి నారా లోకేష్‌కు ఎయు విసి వివరించారు. ఎయు అనుబంధ కళాశాలల తరపున త్వరలో మరొక రూ.40 లక్షల నుంచి రూ.50 లక్షలను ముఖ్యమంత్రి సహాయ నిధికి అందిస్తామన్నారు.

అపోలో రూ.లక్ష విరాళం

ఎంవిపి కాలనీ : ఆంధ్రప్రదేశ్ ఫెడరేషన్ ఆఫ్ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ తరపున సంఘం గౌరవ అధ్యక్షులు ప్రొఫెసర్ జాలాది రవి శనివారం ఉదయం రాష్ట్రమంత్రి నారా లోకేష్‌ను కలిసి రూ. లక్ష విరాళాన్ని డిడి రూపంలో అందజేశారు. విజయవాడ వరదల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చేబట్టిన సహాయ కార్యక్రమాల్ని ఆంధ్ర విశ్వవిద్యాలయంతో పాటు రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల టీచర్ల సంఘం తరపున ప్రశంసించారు. ప్రభుత్వానికి అండగా నిలుస్తామనిమద్దతు ప్రకటించారు.

అప్సా రూ.64లక్షల సాయం

గాజువాక : విజయవాడ వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధికి శనివారం ఎపి ప్రయివేటు స్కూల్స్ అసోసియేషన్ (అప్సా) ఆధ్వర్యాన విరాళం అందజేశారు. రూ.64,02,854 చెక్కును ముఖ్యమంత్రి చంద్రబాబుకు అప్సా ప్రతినిధులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, అప్సా రాష్ట్ర అధ్యక్షుడు వి.సుబ్రహ్మణ్యరాజు, సెక్రటరీ టి.సింహాచలం, గౌరవాధ్యక్షులు ఎమ్.జనార్ధన్, ఛైర్మన్ కె.చంద్రశేఖర్, రవీంద్రబాబు, వి.సుందరం, ఫైనాన్షియల్ సెక్రటరీ పి.భాస్కరరావు, గణపతిరావు, అప్పలనాయుడు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



చంద్రబాబుకు చెక్కును అందజేస్తున్న అప్సా నాయకులు

రేపు మూడో జోన్‌లో

తాగునీటి సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ.: జివిఎంసి మూడవ జోన్ పరిధిలో పలు ప్రాంతాలలో ఈనెల 21న సోమవారం తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని జివిఎంసి మంచినీటి సరఫరా విభాగం కార్యనిర్వాహక ఇంజనీరు శ్రీనివాస్ ప్రసాద్ శనివారం పత్రికా ప్రకటనలో తెలిపారు. జివిఎంసి టిఎస్‌ఆర్ నుంచి హై లెవెల్ రిజర్వాయర్‌కు మంచినీటిని సరఫరాచేసే ప్రధాన పంపింగ్ పైపు లైను మరమ్మతులకు గురైనందున దాని బాగుచేసే చర్యల్లో భాగంగా నీటిసరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. ఈమేరకు 22వ వార్డు లో టైమ్స్ ఆఫ్ ఇండియా, సిద్ధార్థ నగర్, 24వ వార్డులో పాత రేసపువాని పాలెం, వినాయక నగర్, తులసీపేట, స్వర్ణ భారతి స్టేడియం ఏరియా, 27వ వార్డులో అశోక్ నగర్, రామా టాకీస్ రోడ్, శ్రీనగర్, బుదిల్ పార్కు రోడ్, రెడ్డి ఆసుపత్రి రోడ్, శ్రీనగర్ సాయిబాబా టెంపుల్ రోడ్, ద్వారకా నగర్ రోడ్ 1 నుండి 6 లైన్ల వరకు, అమర్‌నగర్ చర్చ్ రోడ్డు, సిబిఎం కాంపౌండ్, రామా టాకీస్ లేడీస్ గేట్ రోడ్, మొదలైన ప్రాంతాలకు తాగునీటికి అంతరాయం కలుగుతుందన్నారు. ప్రజలకు తాగునీటికి అసౌకర్యం కలగకుండా ట్యాంకర్ల ద్వారా మంచినీటి సరఫరా చేస్తామని, ఆయా ప్రాంతాల ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

మద్యం మత్తులో

వాహనాలు నడిపితే చర్యలు



బ్రీత్ ఎనలైజర్‌తో తనిఖీ చేస్తున్న ఎస్ఐ

ప్రజాశక్తి -కొత్తకోట : మద్యం మత్తులో వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని కొత్తకోట ఎస్సై ఎం. శ్రీనివాస్ స్పష్టం చేశారు. శుక్రవారం రాత్రి కొత్తకోట గ్రామ సమీపంలో వాహనాలు తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి రోజు వాహనాలు తనిఖీలు ముమ్మ రంగా చేపడుతున్నామన్నారు వాహనాల రికార్డులతోపాటు హెల్మెట్ లేని వారికి ఫైన్ వేస్తామన్నారు. రాత్రివేళ తనిఖీల్లో మద్యం తాగి వాహనాలు నడిపినట్లు పట్టుబడితే అలాంటి వారిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేస్తామన్నారు. మూడు రోజులలో ఏడు వాహనాలపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసామని, ఒక్కొక్కరికి రూ 10వేలు జరిమానా లేక వారం రోజులు జైలుశిక్ష పడుతుందని ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

దర్జాగా పంచాయతీ బోర్లు కబ్జా

చోద్యం చూస్తున్న అధికారులు

ప్రజాశక్తి-ఎస్ రాయవరం : మండలంలో కొరుప్రోలు గ్రామంలో యథేచ్ఛగా పంచాయతీ బోర్లును కబ్జా చేసిన ఘటన చోటుచేసుకుంది. కొరుప్రోలు గ్రామపంచాయితీ పరిధిలో 29 బోర్లు ఉండగా, వాటిలో 25 బోర్లు పనిచేస్తున్నాయి. దళితకాలనీలో ఒకటి, మెట్టమీద ఒక బోరు పని చేయడంలేదని కార్యదర్శి రామలక్ష్మి తెలిపారు. మిగిలిన రెండు బోర్లు ఎక్కడని ఆరా తీస్తే, మెట్టమీద ప్రాంతంలో పంచాయితీ బోరును గ్రామానికి చెందిన ఒక వ్యక్తి తను కొన్న స్థలంలో గోడ కట్టి, పంచాయితీ బోరును తన ఇంటి అవసరాలకు వాడుకుంటున్నారన్నారు. రేవుపోలవరం రోడ్డుకు ప్రక్కనే మరొక బోరు గ్రామానికి



బోరు ఆక్రమించి నిర్మించిన ఇల్లు

చెందిన మహిళ నూతన భవన నిర్మాణాలలో బోరును కప్పి వేసినట్లు అధికారులు గుర్తించామన్నారు. ఈ విషయమై స్థానిక ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇఇ కళ్యాణ్ వివరణ కోరగా , పంచాయితీ బోర్లు విషయమై తన దృష్టికి రాలేదన్నారు. పంచాయితీ బోర్లు నిర్మాణం జరిగిన తరువాత పంచాయితీకి అప్పగిస్తామని, పంచాయితీ ఆస్తులను కాపాడు కోవాల్సిన బాధ్యత పంచాయతీలకే ఉంటుందన్నారు. కబ్జాకు గురైన బోర్లకు పంచాయతీ కార్యదర్శి ద్వారా నోటీసులు ఇప్పించి, వాటిని మరల వినియోగంలోకి తెచ్చేందుకు కృషి చేస్తామన్నారు.